


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక | ప్రశ్నించడం మన హక్కు






సంపుటి : 9 సంచిక : 341 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : కాకినాడ మంగళవారం 11 ఆగస్టు 2026 వెల : 1/-రూ ॥

VOLUME :9 ISSUE :341 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : KAKINADA TUE 11 AUGUST 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Kakinada,Ongole,Visakhapatnam,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur


# 2027 నాటికి భూముల రీసర్వే పూర్తి చేస్తాం

- ఏలూరు జిల్లా కలిదిండిలో 'మీ భూమి-మీ హక్కు' కార్యక్రమం
- కొత్త పట్టాదారు పాస్‌బుక్కులు పంపిణీ చేసిన సీఎం చంద్రబాబు
- గత ప్రభుత్వ హయాంలో జరిగిన భూ రికార్డుల తప్పులను సరిదిద్దుతామని వెల్లడి
- బ్లాక్‌చెయిన్ టెక్నాలజీ, క్యూఆర్ కోడ్‌తో పటిష్ఠమైన భద్రతా ఫీచర్లతో కొత్త పాస్‌బుక్కులు
- రెవెన్యూ సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ ఏకైక ఎజెండా అని స్పష్టం



పెన్ పవర్ డెస్క్:రాష్ట్రంలో భూ రికార్డుల ప్రక్షాళనకు శ్రీకారం చుట్టామని, 2027 నాటికి భూముల రీసర్వే ప్రక్రియను పూర్తి చేసి, ప్రభుత్వ అధికారిక చిహ్నంతో కూడిన పట్టాదారు పాస్‌బుక్కులను రైతులకు, భూ యజమానులకు అందిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. రెవెన్యూ సంబంధిత సమస్యలను పరిష్కరించడమే తమ కూటమి ప్రభుత్వ ఏకైక ఎజెండా అని ఆయన పునరుద్ఘాటించారు. సోమవారం ఏలూరు జిల్లా, కైకలూరు నియోజకవర్గంలోని కలిదిండిలో జరిగిన 'మీ భూమి-మీ హక్కు' పట్టాదారు పాస్‌బుక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నల్లజర్ల దుర్గాభవాని అనే మహిళా రైతుకు అధికారిక చిహ్నంతో కూడిన కొత్త పట్టాదారు పాస్‌బుక్‌ను అందజేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో సీఎం మాట్లాడుతూ.. కేంద్రంలో, రాష్ట్రంలో ఉన్న డబుల్ ఇంజిన్ ప్రభుత్వం బుల్లెట్ వేగంతో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తోందన్నారు. రెండో ప్రపంచ యుద్ధంలో పాల్గొన్న మాజీ సైనికులకు కేటాయించిన

- మిగతా 2లో



## దైవ నామాలను అపహాస్యం చేయొద్దు

- గోవింద నామాలను పేరడీ చేయడంపై పవన్ కల్యాణ్ ఆగ్రహం
- నెల్లూరులో ఓ పార్టీ చర్యను తీవ్రంగా ఖండించిన జనసేనాని
- భక్తుల మనోభావాలను కించపరిచే కుట్రపూరిత చర్యగా అభివర్ణన
- ఈ ఘటనపై చట్టపరంగా ముందుకెళ్లాలని పార్టీ నేతలకు ఆదేశం
- దైవ నామాలను అపహాస్యం కోసం వాడొద్దని హితవు

పెన్ పవర్ డెస్క్:దైవ నామాలను, భక్తి గీతాలను రాజకీయ ప్రయోజనాల కోసం పేరడీలుగా మార్చి అపహాస్యం చేయడాన్ని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ తీవ్రంగా ఖండించారు.

- మిగతా 2లో

## ఆగస్టు 17 నుంచి ఏపీ అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు...

### ఈసారి కూడా వైసీపీ గైర్హాజరు?




- ఆగస్ట్ 17 నుంచి ఏపీ శాసనసభ వర్షాకాల సమావేశాలు
- ప్రతిపక్ష హోదా ఇవ్వనందున అసెంబ్లీకి దూరంగా ఉండనున్న వైసీపీ
- శాసనమండలి సమావేశాలకు మాత్రం హాజరుకానున్న విపక్షం
- మండలిలో మెగా డీఎస్సీ అక్రమాలపై ప్రభుత్వాన్ని నిలదీసేందుకు వ్యూహం
- హైకోర్టులో విచారణ దశలో ప్రతిపక్ష హోదా అంశం

- మిగతా 2లో

## 22-ఏ సమస్యకు తక్షణ పరిష్కారం.. 830 కుటుంబాలకు సీఎం చంద్రబాబు ఊరట

- కలిదిండిలో 'మీ భూమి-మీ హక్కు' కార్యక్రమంలో సీఎం చంద్రబాబు
- 22-ఏ జాబితాలో భూములపై రైతులు, మాజీ సైనికుల ఫిర్యాదు
- జాబితా నుంచి భూములను తొలగించాలని కలెక్టర్‌కు తక్షణ ఆదేశం
- 830 కుటుంబాలకు చెందిన 2,745 ఎకరాలకు విముక్తి
- లబ్ధిదారులకు 1-బి అడంగల్ పత్రాలు అందజేసిన ముఖ్యమంత్రి



పెన్ పవర్ డెస్క్:ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న తీవ్రమైన భూ సమస్యకు ముఖ్యమంత్రి చంద్రబాబు తక్షణ పరిష్కారం చూపారు. సోమవారం ఆయన ఏలూరు జిల్లా, కైకలూరు నియోజకవర్గం పరిధిలోని కలిదిండిలో 'మీ భూమి-మీ హక్కు'

- మిగతా 2లో


## పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

- డీఎస్సీలో అక్రమాలు జరిగాయంటూ వైసీపీ నిరసన దీక్షలు
- తాడిపత్రికి వెళుతున్న పెద్దిరెడ్డి, అనంత వెంకట్రామిరెడ్డిలను అడ్డుకున్న పోలీసులు
- ఇద్దరినీ అదుపులోకి తీసుకుని అనంతపురంకు తరలించిన పోలీసులు



పెన్ పవర్ డెస్క్:డీఎస్సీలో అక్రమాలు జరిగాయంటూ రాష్ట్ర వ్యాప్తంగా వైసీపీ నిరసన ర్యాలీలకు పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. ఈ నిరసనల్లో పాల్గొనేందుకు అనంతపురం జిల్లా తాడిపత్రికి వెళ్తున్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆ పార్టీ జిల్లా

- మిగతా 2లో



## కొలంబియాలో భారీ భూకంపం.. రిక్టర్ స్కేల్‌పై 7.4 తీవ్రత నమోదు.. 20 మంది మృతి

పెన్ పవర్ డెస్క్: కొలంబియాలో భారీ భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేల్‌పై భూకంప తీవ్రత 7.4గా నమోదు అయ్యింది. ఈ ఘటనలో కనీసం 20 మరణించగా.. పలువురు భవన శిథిలాల కింద చిక్కుకున్నట్లు అధికారులు తెలిపారు. యూఎస్ జియోలాజికల్ సర్వే

- మిగతా 2లో

## తెలుగు అమ్మాయిలతో స్కెచ్.. ఢిల్లీ కేంద్రంగా భారీ మోసం గుట్టురట్టు!




- ఢిల్లీలోని ఫేక్ కాల్ సెంటర్లపై తెలంగాణ సైబర్ బ్యూరో దాడులు
- తెలుగు మాట్లాడే యువతులనే టెలీకాలర్లుగా నియమించుకున్న కేటుగాళ్లు
- లోన్ల పేరుతో మోసం, 21 మంది యువతులతో పాటు వ్యక్తి అరెస్టు
- ప్రధాన సూత్రధారులు పరారీ, కొనసాగుతున్న దర్యాప్తు

పెన్ పవర్ డెస్క్:ఢిల్లీ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న మూడు మోసపూరిత కాల్ సెంటర్లపై తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్‌బీ) అధికారులు సోమవారం దాడులు నిర్వహించారు. బజాజ్ ఫైనాన్స్ పేరుతో రుణాలు ఇస్తామని నమ్మించి మోసాలకు పాల్పడుతున్న ఈ ముఠాకు సంబంధించి 22 మందిని

- మిగతా 2లో



## ఝార్ఖండ్‌లో టెన్షన్.. బారికేడ్లు బద్దలుకొట్టిన విద్యార్థులు.. వాటర్ కేనన్‌ల ప్రయోగం

- ఝార్ఖండ్‌లో విద్యార్థుల ఆందోళన ఉద్రిక్తం
- బారికేడ్లు దాటి అసెంబ్లీ వైపు విద్యార్థుల మార్చ్
- అడ్డుకునేందుకు వాటర్ కేనన్లు ప్రయోగించిన పోలీసులు
- పేపర్ లీక్‌లపై సీబీఐ దర్యాప్తు కోరుతున్న విద్యార్థులు
- 13 పరీక్షలను రద్దు చేయాలని డిమాండ్

పెన్ పవర్ డెస్క్:ఉద్యోగ నియామక పరీక్షల్లో పేపర్ లీక్‌లకు వ్యతిరేకంగా ఝార్ఖండ్‌లో విద్యార్థుల ఆందోళన ఉద్రిక్తంగా మారింది. రాంచీలో అసెంబ్లీ వైపు వెళ్లేందుకు విద్యార్థులు బారికేడ్లను దాటడంతో పోలీసులు వాటర్ కేనన్లు ప్రయోగించారు. అయినా కొందరు విద్యార్థులు నృత్యాలు చేస్తూ ముందుకు కదలడం వీడియోల్లో కనిపించింది. నియామక పరీక్షల్లో అక్రమాలు, పేపర్ లీక్‌లతో తమ భవిష్యత్తు దెబ్బతింటోందని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యలకు పరిష్కారం చూపాలని కోరుతూ సోమవారం వేలాది మంది రాంచీకి తరలివచ్చారు. రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి రైళ్లు, బస్సులు, ఇతర వాహనాల్లో రాజధానికి చేరుకున్నారు. అసెంబ్లీ ముట్టడికి బయలుదేరే ముందు విద్యార్థి నేత దేవేంద్ర మహతో కీలక సూచన చేశారు. పోలీసులు అడ్డుకున్నప్పుడు వారితో వాగ్వాదానికి దిగొద్దని కోరారు. క్రమశిక్షణతో మరో మార్గం ద్వారా

- మిగతా 2లో




## పన్నెండేళ్లలో రూ.10 లక్షల కోట్ల కార్పోరేట్ రుణాలు మాఫీ

పెన్ పవర్ డెస్క్:కార్పొరేట్ రుణాలు అంటే తెలిసే ఉంటుంది. పెద్దపెద్ద ప్రైవేటు కంపెనీలకు బ్యాంకులు ఇచ్చిన రుణాలు. గత పన్నెండేళ్లలో బ్యాంకులు మాఫీ చేసిన కార్పొరేట్ రుణాలు 9 లక్షల 95 వేల కోట్ల రూపాయలు. అంటే దాదాపు పది లక్షల కోట్లు. కార్పొరేట్ లోన్స్ రైట్ ఆఫ్ లెక్కలు కేంద్ర ప్రభుత్వం 2026 ఆగస్టు 10న పార్లమెంటుకు తెలిపింది. కార్పొరేట్ రుణాలు మాఫీపై మాట్లాడుతూ.. పూర్తిగా రద్దు చేసనట్లు కాదని..

- మిగతా 2లో

## పన్నుల బిల్లుకు పార్లమెంట్ ఆమోదం..

### యూపీఐ ఛార్జీలపై నిర్మలా సీతారామన్ కీలక ప్రకటన

- పన్నుల సవరణ బిల్లు 2026కు పార్లమెంట్ ఆమోదం
- యూపీఐ లావాదేవీలపై వినియోగదారులకు ఛార్జీలు లేవని నిర్మలా సీతారామన్ స్పష్టీకరణ
- మర్చంట్ డిస్కౌంట్ రేట్‌పై ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదన్న కేంద్రం
- భవిష్యత్తులో ఛార్జీలు వచ్చినా వ్యాపారులకే, అదీ పెద్ద లావాదేవీలకే వర్తింపు
- రోజువారీ కొనుగోళ్లు 90 శాతం ఉచితంగానే కొనసాగుతాయని వెల్లడి



పెన్ పవర్ డెస్క్:యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) లావాదేవీలపై వినియోగదారు లకు ఎటువంటి ఛార్జీలు లేదా పన్నులు విధించే ఉద్దేశం లేదని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సోమవారం పార్లమెంటులో స్పష్టం చేశారు. పన్నుల, ఇతర చట్టాల (సవరణ) బిల్లు 2026కు పార్లమెంట్ ఆమోదం

- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

# జగన్ వర్సెస్ పవన్... ఎపుడు ఎక్కడ ?

ఏపీ రాజకీయాలు క్షుణ్ణంగా పరిశీలిస్తే కూటమిలో పెద్దన్న అయిన టీడీపీతోనే వైసీపీ ఢీ కొడుతోంది. అందులో రెండవ పెద్ద పార్టీ మిత్రపక్షంగా ఉన్న జనసేన ఊరు తలవడం లేదు, ఇక బీజేపీ గురించి వైసీపీ పెద్దగా ఎపుడూ మాట్లాడింది లేదు, విమర్శలు చేసింది లేదు అనే అంటారు. మరి వైసీపీ ఈ రకంగా వ్యూహ రచన చేయడం వెనక కారణాలు ఏమిటి అన్న చర్చ సాగుతోంది. నిజానికి వైసీపీని కూటమిలోని మూడు పార్టీలూ కలసి కట్టుగా ఓడించాయి. ఏదైనా విమర్శ చేయాల్సి వస్తే మూడు పార్టీలూ గట్టిగానే చేస్తాయి. ఏ మాత్రం స్పేర్ చేయవు కూడా. కానీ వైసీపీ మాత్రం కూటమిలోని పార్టీలను ఎంచుకుని మరీ తమ రాజకీయ విమర్శలకు పదును పెడుతోంది.

**జనసేనతో ఎందుకలా :**

ఇక జనసేన విషయానికి వస్తే ఎందుకో వైసీపీ ఈ మధ్య పెద్దగా స్పందించడం లేదు. బహుశా 2024 కి ముందు అధికారంలో ఉన్నపుడు పవన్ ని గట్టిగా టార్గెట్ చేసి ఆ సామాజిక వర్గం ఆగ్రహానికి గురి అయ్యామన్న ముందు జాగ్రత్త కాబోలు అని అంటున్నారు. అంతే కాదు ప్రభుత్వంలో పెద్దన్నగా టీడీపీ ఉందని ఆ పార్టీ నిర్ణయాలే అమలు అవుతున్నాయని అందువల్ల జనసేనను ఊరకే అని నాలుగు తిని ఆ పార్టీతో పెట్టుకోవడం ఎందుకొచ్చినది అన్న రాజకీయ తెలివిడితో కూడా ఈ విధంగా వ్యవహరిస్తున్నారు అని అంటున్నారు.

**వారి మంత్రుల మీద :**

అంతే కాదు జనసేన మంత్రుల శాఖ మీద కూడా వైసీపీ ఇప్పటిదాకా విమర్శలు చేసింది లేదు, పవన్ చేతిలో అయిదు శాఖలు ఉన్నాయి. అలాగే నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్ కూడా కీలక శాఖలనే చూస్తున్నారు. అయితే వైసీపీ మాత్రం ఈ శాఖల జోలికి ఏ మాత్రం పోవడం లేదు, మరో వైపు ఈ శాఖలలో ఆ మంత్రులు బాగానే పనిచేస్తున్నారు అని అంటున్నారు. దాంతో కూడా జనసేన వైపే వైసీపీ చూడడం లేదని అంటోంది. అదే ఏ చిన్న తప్పు జరిగినా టీడీపీ మంత్రుల శాఖల మీద మాత్రం రాజకీయ రాద్ధాంతం చేస్తోంది అని గుర్తు చేస్తున్నారు. అంటే వైసీపీ ఒక వైపే చూస్తోంది అని అంటున్నారు.

**వ్యూహాత్మకంగానే :**

జనసేనను వైసీపీ ఈ విధంగా పక్కన పెట్టడం వెనక రాజకీయ వ్యూహాలే ఉన్నాయని అంటున్నారు. 2024 ఎన్నికలు వేరు, 2029 ఎన్నికలు వేరు అని అంటున్నారు. రాజకీయాల్లో ఎపుడేమి జరుగుతుందో ఎవరికీ తెలియదు అని అంటారు. అందువల్ల తమ శాశ్వత ప్రత్యర్థిగా టీడీపీనే వైసీపీ ఎంచుకుంది అని అంటున్నారు. టీడీపీ అంటే ఒంటి కాలు మీద వైసీపీ లేస్తుంది. మిగిలిన కూటమి పార్టీల మీద ఆ స్పీడ్ అసలు చూపించడం లేదు అంటే అది పక్కా రాజకీయ ఎత్తుగడగానే చూస్తున్నారు. గతంలో వైసీపీ ఈ విధంగా వ్యవహరించలేదు అని కూడా అంటున్నారు. ఒకేసారి ఒకరిని మించి ఎక్కువ మంది ప్రత్యర్థులను తయారు చేసుకుని వారందరినీ అనేస్తూ వారి నుంచి వచ్చే విమర్శల జడివానలో తడిసిపోతూ ఉక్కిరిబిక్కిరి అయ్యేదని చెబుతున్నారు.

**ఇప్పట్లో ఉందా లేదా :**

ఈ క్రమంలో జగన్ ఎక్కడికి బహిరంగ సభలు నిర్వహించినా లేదా పర్యటనలు చేసినా మీడియా మీటింగ్స్ పెట్టినా చంద్రబాబు లోకేష్ ల మీదనే గట్టిగా ఫోకస్ పెడుతున్నారు. గతంలో మాదిరిగా పవన్ ని దత్తపుత్రుడు ట్యాగ్ పెట్టి విమర్శలు అయితే చేయడం లేదు, మరి జగన్ ఒకటి అంటే అటు నుంచి కూడా రీ సౌండ్ వస్తుంది. అలా జగన్ వర్సెస్ పవన్ అన్నట్లుగా ఏపీ రాజకీయం హీటెక్కడం ఖాయం. కానీ అది మాత్రం ఇటీవల కాలంలో జరగడం లేదు, ఇంతకీ అలాంటి సందర్భం వస్తుందా లేదా ఇక వైసీపీ కొత్త వ్యూహాలలో భాగంగా ఇదంతా అలా సాగిపోతుందా అంటే వేచి చూడాల్సిందే అని అంటున్నారు.

# 2027 నాటికి భూముల రీసర్వే పూర్తి చేస్తాం

- మొదటి పేజి తరువాయి

భూములను సెక్షన్ 22–ఏ పరిధిలో పెట్టి ఇబ్బందులకు గురిచేస్తే, తమ ప్రభుత్వం ఆ సమస్యను పరిష్కరించి వారికి పట్టాలు అందించిందని గుర్తుచేశారు.

**గత ప్రభుత్వ వైఫల్యాలపై విమర్శలు**

2019–2024 మధ్య గత ప్రభుత్వ హయాంలో జరిగిన విధ్వంసం రెవెన్యూ రికార్డులను తీవ్రంగా దెబ్బతీసిందని చంద్రబాబు ఆరోపించారు. భూములు, ఆస్తులను డిజిటల్‌గా 22–ఏ పరిధిలోకి తెచ్చి వివాదాలు సృష్టించారని మండిపడ్డారు. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే భూ సమస్యలపై పెద్ద ఎత్తున ఫిర్యాదులు వెల్లువెత్తాయని తెలిపారు. ఈ నేపథ్యంలో భూ రికార్డులను శుభ్రపరిచి, క్రమబద్ధీకరించేందుకు 'రెవెన్యూ రికార్డ్స్ రిఫార్మ్స్ 2026'ను ప్రవేశపెట్టినట్లు వివరించారు.

**పటిష్ఠ భద్రతతో కొత్త పాస్‌బుక్కులు**

కొత్తగా జారీ చేస్తున్న పట్టాదారు పాస్‌బుక్కులలో కరెన్సీ నోట్లకు వినియోగించే తరహాలోనే పటిష్ఠమైన భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నామని సీఎం తెలిపారు. ఆస్తుల వివరాలను మార్చేందుకు వీలులేకుండా బ్లాక్‌చెయిన్ టెక్నాలజీని, దీనికి అదనంగా క్యూఆర్ కోడ్ వంటి సాంకేతిక భద్రతా ఫీచర్లను పొందుపరిచామన్నారు. రైతుల సమక్షంలోనే రీసర్వే నిర్వహిస్తూ, వారి ఈ–కేవైసీ తీసుకున్నాకే గ్రామసభలు పెట్టి పారదర్శకంగా పాస్‌బుక్కులు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటివరకు 32.22 లక్షల పట్టాదారు పాస్‌బుక్కులు రైతులకు, భూ యజమానులకు అందజేశామని, రాబోయే ఏడు నెలల్లో 9,365 గ్రామాల్లో రీసర్వే పూర్తి చేసి 68.64 లక్షల పాస్‌బుక్కులు జారీ చేస్తామని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు దాదాపు 41,000 ఎకరాలకు సంబంధించిన భూ సమస్యలను పరిష్కరించడం ద్వారా 1.27 లక్షల మంది రైతులకు, పరిశ్రమలకు, ప్రజలకు లబ్ధి చేకూర్చామన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, నిబంధనలు ఉల్లంఘిస్తే వారు సొంత పార్టీ వారైనా ఉపేక్షించేది లేదని గుంటూరు ఘటనను ఉదాహరణగా చూపిస్తూ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా రైతులకు ట్రాక్టర్లను పంపిణీ చేసి, ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను సీఎం సందర్శించారు.

# దైవ నామాలను అపహాస్యం చేయొద్దు

- మొదటి పేజి తరువాయి

తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారి పవిత్ర నామాలను కించపరచడం దారుణమని ఆయన పేర్కొన్నారు. భక్తుల మనోభావాలను దెబ్బతీసే ఇలాంటి చర్యలను ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. నెల్లూరు నగరంలో చోటుచేసుకున్న ఓ ఘటనను ఆయన ప్రస్తావించారు. కనీసం ప్రతిపక్ష హోదా కూడా లేని ఓ రాజకీయ పార్టీ, తమ కార్యక్రమాల్లో పవిత్రమైన గోవింద నామాలను పేరడీగా వాడుకోవడం భక్తుల మనోభావాలను తీవ్రంగా గాయపరిచిందని అన్నారు. ఆ కార్యక్రమంలో పాల్గొన్న వారి తీరు ధార్మిక విశ్వాసాలకు విఘాతం కలిగించేలా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది కేవలం అపహాస్యం చేయడమే కాదని, మతపరమైన విద్వేషాలను రెచ్చగొట్టే కుట్రపూరిత ఆలోచన అని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని జనసేన పార్టీ శ్రేణులకు పవన్ కల్యాణ్ దిశానిర్దేశం చేశారు. ధార్మిక విశ్వాసాలతో ముడిపడిన అంశాలను చులకన చేసే ఇలాంటి చర్యలను సహించకూడదని స్పష్టం చేశారు.

రాజకీయాలతో సంబంధం లేకుండా ఎవరూ కూడా దైవ నామాలు, మంత్రాలు, స్తోత్రాలను అపహాస్యం చేసేందుకు వినియోగించవద్దని ఆయన హితవు పలికారు. భక్తికి సంబంధించిన పవిత్రమైన విషయాలను గౌరవించడం అందరి బాధ్యత అని ఆయన సూచించారు. ఈ మేరకు జనసేన పార్టీ కేంద్ర కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది.

# ఆగస్టు 17 నుంచి ఏపీ అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు...

ఆంధ్రప్రదేశ్ శాసనసభ వర్షాకాల సమావేశాలు ఆగస్ట్ 17 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు రాష్ట్ర గవర్నర్ జస్టిస్ ఎస్. అబ్దుల్ నజీర్ సోమవారం నోటిఫికేషన్ జారీ చేశారు. అయితే, ప్రతిపక్ష హోదా వివాదం నేపథ్యంలో ఈ సమావేశాలకు దూరంగా ఉండాలని వైసీపీ యోచిస్తున్నట్లు తెలుస్తోంది. నోటిఫికేషన్ ప్రకా రం, ఆగస్ట్ 17న ఉదయం 9 గంటలకు శాసనసభ, ఉదయం 10 గంటలకు శాసనమండలి సమావేశాలు ప్రారంభమవుతాయి. 2024 ఎన్నికల్లో కేవలం 11 స్థానాలకే పరిమితమైన వైసీపీకి ప్రతిపక్ష నేత (ఎల్ఓపీ) హోదా ఇచ్చేందుకు ప్రభుత్వం నిరాకరించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో, తమ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ కు ఎల్ఓపీ హోదా కల్పించనంత వరకు అసెంబ్లీకి హాజరయ్యే ప్రసక్తే లేదని ఆ పార్టీ ఇప్పటికే స్పష్టం చేసింది. ప్రజల గొంతుకను బలంగా వినిపించాలంటే ప్రతిపక్ష హోదా తప్పనిసరి అని, ప్రజాస్వామ్యాన్ని గౌరవించకపోవడం వారి అవివేకమే అవుతుందని జగన్ గతంలో వ్యాఖ్యానించారు. ఈ హోదాకు సంబంధించిన అంశం ప్రస్తుతం హైకోర్టులో విచారణ దశలో ఉంది. అయితే, అసెంబ్లీకి దూరంగా ఉన్నప్పటికీ శాసనమండలి సమావేశాలకు మాత్రం హాజరు కావాలని వైసీపీ నిర్ణయించింది. మండలిలో తమకు పూర్తి మెజారిటీ ఉండటంతో, వివిధ ప్రజా సమస్యలపై ఎన్డీఏ ప్రభుత్వాన్ని నిలదీసేందుకు సిద్ధమవుతోంది. ముఖ్యంగా, మెగా డీఎస్సీ–2025లో చోటుచేసుకున్నాయని ఆరోపిస్తున్న అక్రమాలపై మండలిలో గళం విప్పనుంది.

ఈ అంశంపై తక్షణమే సీబీఐ విచారణ జరపాలని, పారదర్శక దర్యాప్తు కోసం విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ రాజీనామా చేయాలని వైసీపీ డిమాండ్ చేస్తోంది. అయితే, తాము డీఎస్సీ పరీక్షను రద్దు చేయాలని గానీ, ఇప్పటికే నియామకమైన అభ్యర్థులను తొలగించాలని గానీ కోరడం లేదని వైసీపీ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి స్పష్టం చేశారు. అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి, అర్హులైన అభ్యర్థులకు న్యాయం చేయడమే తమ లక్ష్యమని ఆయన వివరించారు. దీంతో ఈ వర్షాకాల సమావేశాలు వాడివేడిగా జరిగే అవకాశం కనిపిస్తోంది.

# 22-ఏ సమస్యకు తక్షణ పరిష్కారం.. 830 కుటుంబాలకు సీఎం చంద్రబాబు ఊరట

- మొదటి పేజి తరువాయి

కార్యక్రమం కోసం విచ్చేశారు. ఈ సందర్భంగా, తమ భూములు 22–ఏ నిషేధిత జాబితాలో చేరడంతో ఇబ్బందులు పడుతున్నామని పలువురు రైతులు, మాజీ సైనికులు సీఎం దృష్టికి తీసుకురాగా, వాటిని తక్షణమే ఆ జాబితా నుంచి తొలగించాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. వివరాల్లోకి వెళితే, సోమవారం కలిదిండి తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ఈ సమావేశంలో బాధితులు తమ గోడును వెళ్లబోసుకున్నారు. తమకు హక్కుగా సంక్రమించిన భూములను 22–ఏ జాబితాలో చేర్చడం వల్ల రిజిస్ట్రేషన్లు చేసుకోలేక, అమ్ముకోలేక తీవ్రంగా నష్టపోతున్నామని ముఖ్యమంత్రికి వివరించారు. వారి సమస్యలను సావధానంగా విన్న చంద్రబాబు, ప్రజలకు మేలు చేసేలా అక్కడికక్కడే నిర్ణయం తీసుకున్నారు. సీఎం ఆదేశాలతో ఉనికిలి, కలిదిండి, వైవాక గ్రామాలకు చెందిన 830 కుటుంబాలకు భారీ ఊరట లభించింది. వారికి సంబంధించిన 2,745 ఎకరాల భూములను 22–ఏ జాబితా నుంచి తొలగించే

ప్రక్రియకు మార్గం సుగమమైంది. డీనోటిఫికేషన్ అధికారాలను ఆర్డీఓకు కల్పించాలని కూడా ఈ సందర్భంగా సీఎం సూచించారు. అనంతరం, సమస్య పరిష్కారానికి గుర్తుగా లబ్ధిదారులకు 1–బి అడంగల్ ప్రతులను చంద్రబాబు స్వయంగా అందజేశారు. దశాబ్దాలుగా నలుగుతున్న తమ సమస్యకు ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు వెంటనే పరిష్కారం చూపడంతో రైతులు, బాధితులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు ముఖ్యమంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# కొలంబియాలో భారీ భూకంపం.. రిక్టర్ స్కేల్‌పై 7.4 తీవ్రత నమోదు.. 20 మంది మృతి

- మొదటి పేజి తరువాయి

ప్రకారం.. సోమవారం (ఆగస్ట్ 10) కొలంబియా రాజధాని బొగోటాకు పశ్చిమాన దాదాపు 250 మైళ్ల (400 కిలోమీటర్ల) దూరంలో ఉన్న శాన్ జోస్ డెల్ పాల్మార్ అనే గ్రామంలో ఈ భారీ భూకంపం సంభవించింది. ఈ భూకంప కేంద్రం భూమికి 107 కిలోమీటర్ల లోతులో కేంద్రీకృతమై ఉన్నట్లు తెలిపింది. ఒక్కసారిగా భూమి కంపించడంతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురై ఇళ్లు, కార్యాలయాల నుంచి బయటకు పరుగులు తీశారు. శక్తివంతమైన ప్రకంపనల ధాటికి పలు చోట్ల భారీ భవనాలు నేలమట్టమయ్యాయి. దీంతో పలువురు శిథిలాల కింద ప్రజలు చిక్కుకుపోగా పలువురు తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే అత్యవసర సహాయక బృందాలు రెస్క్యూ ఆపరేషన్ చేపట్టాయి. ప్రజలను భూకంప ప్రభావిత ప్రాంతాలను నుంచి సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

ఈ ఘటనలో ఇప్పటి వరకు 20 మందికి పైగా మరణించగా.. పదుల సంఖ్యలో ప్రజలు గాయపడ్డారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ప్రాణ, ఆస్తి నష్టానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఈ భూకంప ప్రభావం కొలంబియా పొరుగు దేశమైన ఈక్వెడార్‌లో కూడా కనిపించింది. ఈక్వెడార్ లో కూడా పలు ప్రాంతాల్లో భూమి స్వల్పంగా కంపించింది.

# ఝార్ఖండ్‌లో టెన్షన్.. బారికేడ్లు బద్దలుకొట్టిన విద్యార్థులు.. వాటర్ కేనన్‌ల ప్రయోగం

- మొదటి పేజి తరువాయి

అసెంబ్లీకి చేరేందుకు ప్రయత్నించాలని పిలుపునిచ్చారు. విద్యార్థుల మార్చ్ నేపథ్యంలో రాంచీలో పోలీసులు భారీగా మోహరించారు. ప్రధాన కూడళ్లు, కీలక ప్రాంతాల్లో బారికేడ్లు ఏర్పాటు చేశారు. జిల్లా సరిహద్దులు, ప్రధాన రహదారులు, హైవేలపై బస్సులు, ప్రైవేటు వాహనాలను తనిఖీ చేశారు. నగరంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా భారీ భద్రత ఏర్పాటు చేశారు. రాంచీలో చాలా పాఠశాలలకు సోమవారం సెలవు ప్రకటించారు.

**16 రోజులుగా ఆందోళన**

ఝార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్, ఝార్ఖండ్ స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ నిర్వహించిన నియామక పరీక్షల్లో పేపర్ లీక్‌లు, అక్రమాలు జరిగాయని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. 13 పరీక్షలను రద్దు చేసి సీబీఐ దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వంతో ఇప్పటికే ఆరు దఫాలుగా చర్చలు జరిగినా పరిష్కారం కాలేదు. తమ డిమాండ్లలో 98 శాతం అంగీకరించామని ప్రభుత్వం చెబుతోంది. అయితే 13 పరీక్షల్లో కేవలం మూడింటినే రద్దు చేసేందుకు ప్రభుత్వం అంగీకరించిందని విద్యార్థులు అంటున్నారు. ఆందోళనలో భాగంగా ఆరుగురు విద్యార్థులు నిరాహార దీక్ష కొనసాగిస్తున్నారు.

# పన్నెండేళ్లలో రూ.10 లక్షల కోట్ల కార్పోరేట్ రుణాలు మాఫీ

- మొదటి పేజి తరువాయి

రికవరీ కొనసాగుతుందని పేర్కొంది. 2018–19లో అత్యధికంగా లక్షా 48 వేల 753 కోట్ల రుణాలను మాఫీ చేసినట్లు తెలిపింది. 2025–26 ఆర్థిక సంవత్సరానికి 20 వేల 485 కోట్ల రూపాయలు మాఫీ చేసినట్లు ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌధరీ రాతపూర్వకంగా పార్లమెంటుకు తెలిపారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రకారం.. పెద్ద పరిశ్రమలకు ఔట్ స్టాండింగ్ లోన్లు 2025 ఆర్థిక సంవత్సరానికి 63 లక్షల19 వేల 57 కోట్ల రూపాయలు ఉండగా.. 2026 ఆర్థిక సంవత్సరానికి 69 లక్షల 21 వేల 734 కోట్ల రూపాయలకు పెరిగినట్లు తెలిపారు. మాఫీ అనేది అకౌంటింగ్ ప్రొసీజర్ మాత్రమేనని.. రుణ గ్రహీత కంపెనీలకు అది ఎలాంటి ఉపశమనం కాదని పేర్కొన్నారు. కార్పోరేట్ లోన్ల విషయంలో ఎన్డీఏ ప్రభుత్వంపై ఇప్పటికే విమర్శలు వస్తూనే ఉన్నాయి. మోదీ పగ్గాలు చేపట్టాక కార్పోరేట్ రుణాల మాఫీ ఎక్కువగా ఉందని పలు మార్లు ప్రతిపక్షాలు విమర్శలు చేసిన విషయం గమనార్హం. సామాన్యుల లోన్ల విషయంలో ముక్కు పిండి వసూళ్లు చేసే బ్యాంకులు.. కార్పోరేట్ల విషయంలో ఎందుకు ఉదాసీనత వహిస్తున్నాయనే ప్రశ్నలు వెల్లువెత్తుతూనే ఉన్నాయి.

# పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

- మొదటి పేజి తరువాయి

అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డిలను పోలీసులు ముచ్చుకోట వద్ద అడ్డుకున్నారు. తాడిపత్రికి వెళ్లేందుకు అనుమతి లేదని వీరికి పోలీసులు స్పష్టం చేశారు. ఈ క్రమంలో, పోలీసుల తీరును నిరసిస్తూ వైసీపీ నేతలు అక్కడే బైఠాయించారు. దీంతో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, అనంత వెంకటరామిరెడ్డిలను అదుపులోకి తీసుకుని పోలీసులు... వారిని అక్కడి నుంచి అనంతపురంకు తరలించారు.

# తెలుగు అమ్మాయిలతో స్కెచ్.. ఢిల్లీ కేంద్రంగా భారీ మోసం గుట్టురట్టు!

- మొదటి పేజి తరువాయి

అదుపులోకి తీసుకున్నారు. వీరిలో 21 మంది తెలుగు యువతులు, ఒక బ్యాంకు ఖాతాదారుడు ఉన్నారు.

గత 18 నెలలుగా ఈ ముఠా చురుకుగా ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. బజాజ్ ఫైనాన్స్ ప్రతినిధులుగా ఫోన్లు చేసి, ఆకర్షణీయమైన రుణాలను ఆమోదించినట్లు నమ్మించేవారు. ఆ తర్వాత ప్రాసెసింగ్ ఫీజులు, వెరిఫికేషన్ చార్జీలు, డాక్యుమెంటేషన్, ఇన్సూరెన్స్ వంటి పేర్లతో బాధితుల నుంచి డబ్బులు వసూలు చేసేవారు. ఈ మోసాలకు పాల్పడేందుకు నిర్వాహకులు ప్రత్యేకంగా తెలుగు మాట్లాడే యువతులనే నియమించుకున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. తెలంగాణలోని జగిత్యాల జిల్లా కోరుట్ల, హైదరాబాద్‌లోని సైదాబాద్, బోరబండ, మహబూబ్‌నగర్ ప్రాంతాల నుంచి యువతులను టెలీకాలర్లుగా రిక్రూట్ చేసుకున్నారు. లలిత్ సింగ్, కుల్దీప్ సింగ్, అనిల్ అనే ముగ్గురు వ్యక్తులు ఢిల్లీలోని శివ మార్కెట్ కేంద్రంగా ఈ కాల్ సెంటర్లను నడిపిస్తున్నారని, ప్రస్తుతం వారు పరారీలో ఉన్నారని అధికారులు తెలిపారు. ఈ ముఠాకు సంబంధించి తెలంగాణ వ్యాప్తంగా మొత్తం 22 సైబర్ క్రైమ్ కేసులు నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. ఆపరేషన్ సందర్భంగా 23 మొబైల్ ఫోన్లు, రెండు బ్యాంకు పాస్‌బుక్‌లను స్వాధీనం చేసుకున్నారు. అరెస్టయిన యువతుల వయసు 20 నుంచి 42 ఏళ్ల మధ్య ఉంది. పరారీలో ఉన్న ప్రధాన సూత్రధారుల కోసం గాలింపు ముమ్మరం చేశామని, మనీ ట్రయల్‌పై దృష్టి సారించి మోసం పూర్తి స్థాయిని అంచనా వేస్తున్నామని పోలీసులు తెలిపారు.

# పన్నుల బిల్లుకు పార్లమెంట్ ఆమోదం.. యూపీఐ ఛార్జీలపై నిర్మలా సీతారామన్ కీలక ప్రకటన

- మొదటి పేజి తరువాయి

తెలిపిన సందర్భంగా ఆమె ఈ కీలక ప్రకటన చేశారు.

గత వారం లోక్‌సభ ఆమోదం పొందిన ఈ బిల్లును, సోమవారం రాజ్యసభ సైతం మూజువాణి ఓటు ద్వారా ఆమోదించింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పేమెంట్ అండ్ సెటిల్‌మెంట్ సిస్టమ్స్ చట్టంలోని సెక్షన్ 10ఏకు చేసిన సవరణ కేవలం వెసులుబాటు కల్పించే నిబంధన మాత్రమేనని వివరించారు. ఈ సవరణ ద్వారా యూపీఐ వినియోగదారులపై ఎటువంటి లావాదేవీ ఛార్జీలు లేదా పన్నులు విధించడం లేదని ఆమె సభకు విస్పష్టంగా తెలిపారు. మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) విధింపుపై వెలువడుతున్న ఊహాగానాలపై కూడా ఆమె స్పష్టతనిచ్చారు. పార్లమెంట్ ఆమోదం అనంతరం నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) స్టీరింగ్ కమిటీ దీనిపై తుది నిర్ణయం తీసుకుంటుందని, ప్రస్తుతం ఎటువంటి ఎండీఆర్ ఫ్రేమ్‌వర్క్‌ను ఖరారు చేయలేదని వెల్లడించారు. భవిష్యత్తులో ఒకవేళ ఎండీఆర్‌ను ప్రవేశపెట్టినా, అది కేవలం నిర్దిష్ట పరిమితికి మించిన అధిక విలువ గల వ్యాపార లావాదేవీలకు మాత్రమే వర్తిస్తుందని ఆర్థిక శాఖ గతంలోనే స్పష్టం చేసింది. పాలు, కూరగాయలు, కిరాణా వంటి 90 శాతానికి పైగా రోజువారీ కొనుగోళ్లు వ్యాపారులకు కూడా ఉచితంగానే అందుబాటులో ఉంటాయని అధికారులు వెల్లడించారు. 2016లో ప్రారంభమైన యూపీఐ, 2020 జనవరి నుంచి ఉచిత సేవలను అందిస్తూ ప్రపంచంలోనే అతిపెద్ద రియల్–టైమ్ చెల్లింపు వ్యవస్థగా అవతరించింది.

# పారా లీగల్ వాలంటీర్స్ కోసం దరఖాస్తులు స్వీకరణ

**ఆలమూరు, పెన్ పవర్, ఆగస్టు 10;**జాతీయ న్యాయసేవాధికార సంస్థ న్యూఢిల్లీ రూపొందించిన పారా లీగల్ వాలంటీర్స్ పథకం క్రింద ఒక సంవత్సరం కాలం పారా లీగల్ వాలంటీర్స్ గా పనిచేయడానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని ఆలమూరు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఐ.ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటనలో ఆయన తెలిపారు. ఆలమూరు జూనియర్ సివిల్ కోర్టు పరిధిలోని మహిళ, పురుష అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తుదారులు మెట్రిక్యులేషన్ పదవతరగతి ఉత్తీర్ణత సాధించి 18 సంవత్సరాలు నిండినవారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 2026 ఆగస్టు 18 తేదీలోపు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. మౌఖిక ఇంటర్వ్యూ ద్వారా అభ్యర్థులు ఎంపిక జరుగుతుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. దరఖాస్తు ఫారం, వివరాలకోసం చైర్మన్ మండల న్యాయసేవాధికార సంస్థ ఆలమూరును సంప్రదించాలని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.



పెన్ పవర్
కాకినాడ
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా

# స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్,ఎస్పీ






## పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేయాలి

**కాకినాడ, పెన్ పవర్ ఆగస్టు 10:** కాకినాడ నగరంలోని పోలీస్ పరేడ్ మైదానంలో ఆగస్టు 15న నిర్వహించనున్న 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, జిల్లా ఎస్పీ బిందు మాధవ్, జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ సోమవారం పరేడ్ మైదానాన్ని సందర్శించి ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించారు.వేడుకలకు సంబంధించి ఏర్పాటు చేస్తున్న సభా వేదిక, వివిధ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న స్టాళ్లు, శకటాల ప్రదర్శన, సాయుధ దళాల కవాతు తదితర ఏర్పాట్లను అధికారులు పరిశీలించారు. ఆయా ఏర్పాట్లపై రెవెన్యూ, పోలీస్, ఇతర శాఖల అధికారులను వివరాలు అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ ఆగస్టు 15న జిల్లా స్థాయిలో నిర్వహించనున్న 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ముఖ్య అతిథిగా హాజరయ్యే అవకాశం ఉందని తెలిపారు.ఈ నేపథ్యంలో వేడుకల్లో ఎలాంటి లోపాలకు తావులేకుండా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.వేడుకలను తిలకించేందుకు వచ్చే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ముందస్తు ఏర్పాట్లు చేయాలని సూచించారు. ముఖ్యంగా షామియానాలు, తాగునీరు, సిట్టింగ్ ఏర్పాట్లు,ఇతర మౌలిక సదుపాయాలను సమకూర్చాలని అధికారులను ఆదేశించారు.వేడుకలు ప్రశాంతంగా, ఘనంగా జరిగేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు.ఈ పరిశీలనలో కాకినాడ మున్సిపల్ కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ, అదనపు ఎస్పీ శ్రీనివాసరావు,కాకినాడ రెవెన్యూ అధికారి ఎస్.మల్లిబాబు, ఎస్బీ డీఎస్పీ ఎస్.సత్యనారాయణ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# వీఆర్ఏ ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి.



**కిర్లంపూడి/ప్రత్తిపాడు, పెన్ పవర్, ఆగస్టు, 10:** వీఆర్ఏల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ప్రత్తిపాడు మండలం వీఆర్వోల సంఘం నాయకులు ఆధ్వర్యంలో పలువురు వీఆర్వోలు తహసీల్దార్, ఎం సూర్యప్రభకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వీఆర్వోల సంఘం నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ అధికారం లోకి వచ్చి రెండు సంవత్సరాలు దాటినప్పటికీ వీఆర్ఏల సమస్యలను పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. వీఆర్ఏల సమస్యల కోసం ఏపీ వీఆర్ఏ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 12న జిల్లా కలెక్టరేట్ల ముందు ధర్నా కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. తక్షణమే వీఆర్ఏలకు పే స్కేలు అమలు చేయాలని, నామినీలను వీఆర్ఏలుగా నియమించాలని, అర్హులకు ప్రమోషన్ ఇవ్వాలని డిమాండ్ చేస్తారు. లేనిపక్షంలో ఆందోళన ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు కె కృష్ణ,ఎం సత్తిబాబు, కె బాలరాజు, ఎం గంగరాజు, మండలంలోని పలువురు వీఆర్ఏలు పాల్గొన్నారు.

# అమెరికాతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని రద్దు చేయాలి




**అన్ని పంటలకు మద్దతు ధరల గ్యారంటీ చట్టం తేవాలి**

**కాజులూరులో కౌలు రైతుల సంఘం ఆధ్వర్యంలో జైల్‌భరో**


**కాజులూరు, పెన్ పవర్,ఆగస్టు 10:** అమెరికాతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని రద్దు చేయాలని, అన్ని పంటలకు మద్దతు ధరల గ్యారంటీ చట్టం తీసుకురావాలని, కౌలు రైతులకు భూ యజమానితో సంబంధం లేకుండా కౌలు గుర్తింపు కార్డులు జారీ చేయాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం దేశవ్యాప్త పిలుపులో భాగంగా కాజులూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట జైల్‌భరో కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఏపీ కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు వల్లు రాజబాబు,కార్యదర్శి ఎం.రాజశేఖర్ మాట్లాడుతూ అమెరికాతో కేంద్ర ప్రభుత్వం చేసుకునే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం దేశ వ్యవసాయ రంగానికి, రైతులకు నష్టదాయకంగా మారే అవకాశం ఉందని పేర్కొన్నారు.రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఆ ఒప్పందాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.ఎరువులు,డీజిల్ ధరలు పెరగడంతో పాటు వ్యవసాయ ఉత్పత్తి ఖర్చులు భారీగా పెరిగాయని, ఈ నేపథ్యంలో అన్ని పంటలకు మద్దతు ధరల గ్యారంటీ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం తీసుకురావాలని కోరారు. ఉత్పత్తి ఖర్చులకు అదనంగా 50 శాతం కలిపి మద్దతు ధరను నిర్ణయించాలని డిమాండ్ చేశారు.కౌలు రైతులకు భూ యజమానితో సంబంధం లేకుండా కౌలు గుర్తింపు కార్డులు జారీ చేయాలని, ప్రభుత్వ రాయితీలు,బ్యాంకు రుణాలు కౌలు రైతులకే అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.మృతి చెందిన రైతుల కుటుంబాలకు రూ.25 లక్షల పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.వ్యవసాయ పనులు లేని సమయంలో ఉపాధి కూలీలకు సంవత్సరానికి 200 రోజుల పని కల్పించి రోజుకు రూ.700 కూలి ఇవ్వాలని కోరారు. పెరిగిన ధరలకు అనుగుణంగా ప్రతి కార్మికుడికి కనీస వేతనం రూ.31 వేలుగా నిర్ణయించాలని డిమాండ్ చేశారు.కేంద్ర ప్రభుత్వం స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తించి వారికి సమగ్ర చట్టం చేయడంతో పాటు సంక్షేమ పథకాలను అమలు చేయాలని నాయకులు కోరారు. కార్మికులను బానిసలుగా మార్చే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమానికి ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి సీహెచ్.రమణి మద్దతు తెలిపారు.కార్యక్రమంలో రచ్చ లోవరాజు,రేకాడి గంగరాజు,కోట నాగమణి, వాసంశెట్టి గంగావతి, గుత్తుల కనకదుర్గ, కొప్పిశెట్టి పుష్పవతి, చొల్లంగి చంద్రావతి, కోట అనంతలక్ష్మి తదితరులతో పాటు మహిళలు పాల్గొన్నారు.

# ఆలయ నిర్మాణానికి చల్లా విరాళం



**ఆలమూరు, పెన్ పవర్, ఆగస్టు 10;**బిక్కవోలు మండలం రంగాపురం గ్రామంలో నిర్మిస్తున్న శ్రీ అలివేలు మంగా, పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి డాక్టర్ చల్లా ప్రభాకర్రావు రూ.10 వేల విరాళాన్ని అందజేశారు. మండల కేంద్రమైన ఆలమూరులోని ఆయన స్వగృహంలో ఆలయ కమిటీ సభ్యులకు ఈ మొత్తాన్ని అందించారు. ఆలయ నిర్మాణానికి తనవంతు సహకారంగా రూ.10 వేల విరాళాన్ని అందించినందుకు ఆలయ కమిటీ సభ్యులు ప్రభాకర్రావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఆర్థిక సహాయం, విరాళాల కోసం తనను ఆశ్రయించే వారికి శక్తిమేర సహాయ సహకారాలు అందిస్తున్న ఆయన సేవలను పలువురు అభినందించారు. రంగాపురం గ్రామం లో ఆలయ నిర్మాణానికి విరాళం అందించినందుకు గ్రామ టీడీపీ అధ్యక్షుడు కనాటి అప్పలస్వామి,వార్డు సభ్యుడు నీలపాల మణి, ఏపీ సాగర ఫెడరేషన్ డైరెక్టర్ నక్కా సత్యనారాయణ ప్రభాకర్రావుకు కృతజ్ఞతలు తెలిపారు.

# జగ్గంపేటలో రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ ఆకస్మిక పర్యటన



**జగ్గంపేట, పెన్ పవర్, ఆగస్టు 10:** రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ సి.విజయ్ ప్రతాప్ రెడ్డి సోమవారం జగ్గంపేటలో ఆకస్మికంగా పర్యటించారు. జగ్గంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలోని బీసీ బాలికల వసతి గృహాన్ని పరిశీలించి హాస్టల్ విద్యార్థులకు అందుతున్న భోజన నాణ్యత, వసతులపై విద్యార్థులను నేరుగా అడిగి తెలుసుకున్నారు. వసతి గృహంలో వార్డెన్, వంట మనిషి పద్ధతిపై అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ విజయ్ ప్రతాప్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ జగ్గంపేట బీసీ హాస్టల్ పరిస్థితి బాగోలేదని వార్డెన్, వంట మనిషిని డిప్యుటేషన్ పై వెంటనే మార్చాలని డీడీకి సూచించడం జరిగిందన్నారు. అలాగే అంగన్వాడీ సెంటర్ ను పరిశీలించామని అంగన్వాడీ కేంద్రాల నుంచి ఇచ్చే వస్తువులకు సంబంధించిన పుస్తకంలో తల్లులు చూసి సంతకాలు పెట్టాలన్నారు. ఏపీ ఫుడ్ కమిషన్ వాట్సాప్ 9490441117 నెంబర్ కు వీడియోల రూపంలో ఏమైనా సమస్యలు పెడితే తక్షణమే యాక్షన్ తీసుకుంటామన్నారు. వసతి గృహాలు, అంగన్వాడీలకు పేదవారే వస్తారని వారిని మోసం చేయకుండా ప్రభుత్వం అందించే సౌకర్యాలు కల్పించాలని ఆయన పేర్కొన్నారు.

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# మానవత్వమే మహోన్నత సేవ ఆపదలో ఉన్న వారికి మంత్రి సుభాష్ అండ



**ఇద్దరు బాధితులకు రూ.30 వేల ఆర్థిక సహాయం**



**రామచంద్రపురం, పెన్ పవర్,ఆగస్టు 10:** ఆపదలో ఉన్న వారికి అండగా నిలవడమే నిజమైన మానవత్వమని చాటుతూ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ మరోసారి తన ఉదారతను చాటుకున్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఇద్దరు వ్యక్తులకు తనవంతు సహాయంగా మొత్తం రూ.30 వేల ఆర్థిక సాయం అందించారు.రామచంద్రపురం పట్టణంలోని 2వ వార్డుకు చెందిన దొమ్మలపాటి నాగలక్ష్మి కాళ్లు, చేతులు చచ్చుబడి మంచానికే పరిమితమై తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలుసుకున్న మంత్రి సుభాష్ ఆమెకు రూ.20 వేల విలువైన చెక్కును అందజేశారు. కుటుంబ పరిస్థితులను అడిగి తెలుసుకుని, కష్టకాలంలో అండగా ఉంటానని భరోసా కల్పించారు. అదేవిధంగా కొండయ్యపాలెంకు చెందిన వెంకన్న బాబు కాలికి ఆపరేషన్ జరగడంతో అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న మంత్రి సుభాష్ ఆయనకు రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని చెక్కు రూపంలో అందించారు.ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరికీ తనవంతు సహాయం అందించేందుకు ఎల్లప్పుడూ ముందుంటానని తెలిపారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా వైద్యం పొందేందుకు ఇబ్బందులు పడుతున్న నిరుపేదలకు అండగా నిలవడం తన బాధ్యతగా భావిస్తున్నానన్నారు.ప్రజా సేవ అంటే కేవలం పదవిలో ఉండటం మాత్రమే కాదని,కష్టాల్లో ఉన్నవారికి చేయూతనివ్వడమే నిజమైన సేవ అని మంత్రి పేర్కొన్నారు.కష్టకాలంలో తమకు అండగా నిలిచి మానవతా దృక్పథంతో ఆర్థిక సహాయం అందించిన మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు బాధితులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు మద్య పద్మావతి,2వ వార్డు ఇన్‌చార్జి సవరపు సుధీర్, పదంమూర్తి, దొమ్మలపాటి విజయలక్ష్మి రాజశేఖర్, పలివెల జగదీష్ రాజశేఖర్,దొమ్మలపాటి లాలీ ప్రసాద్, వార్డు ముఖ్య నాయకులు,కూటమి పార్టీల ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా యూటీఎఫ్ 52వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు






**ఆత్రేయపురం, పెన్ పవర్ ఆగస్టు 10:** ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) 52వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఆత్రేయపురం మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ పతాకాన్ని సీనియర్ యూటీఎఫ్ నాయకులు ఎస్.ఎస్.బి. ప్రసాదరాజు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యూటీఎఫ్ ఆవిర్భావం నుంచి ఉపాధ్యాయుల హక్కులు, విద్యారంగ పరిరక్షణ కోసం నిర్వహించిన ఉద్యమాలను వివరించారు. ఉపాధ్యాయ సంఘ ఉద్యమంలో అమరులైన వారి త్యాగాలను కొనియాడారు. ప్రస్తుతం ఉపాధ్యాయ వర్గం ఎదుర్కొంటున్న సమస్యలు, సవాళ్లను ఐక్యంగా ఎదుర్కొని అధిగమించాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు.
కార్యక్రమంలో యూటీఎఫ్ అధ్యక్షులు టి. రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి సీహెచ్. సుధాకరబాబు, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ కె. శ్రీనివాస్, గౌరవ అధ్యక్షులు ఎస్. ప్రసాద్, కోశాధికారి కె. ప్రసాద్‌తో పాటు ఉపాధ్యాయులు కారింకి సత్యనారాయణ, చిప్పాడ సత్యనారాయణ, పి. వెంకటరాజు, ఆర్. సత్యనారాయణ, ఎం. పోలారావు, ఎన్. పెద్దదొర, ఎస్. సాయిరాం, కె. ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.ద

## వరుస దొంగతనాల కేసుల్లో ఇద్దరికి ఆరు నెలల జైలు

**గండేపల్లి, పెన్ పవర్, ఆగస్టు 10:** వరుస దొంగతనాలకు పాల్పడిన ఇద్దరు నిందితులకు గౌరవ న్యాయస్థానం ఆరు నెలల జైలు శిక్ష విధించింది. తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్, ఐపీఎస్ ఆదేశాల మేరకు పెద్దాపురం డీఎస్పీ, జగ్గంపేట సీఐల పర్యవేక్షణలో దొంగతనాల కేసులను వేగవంతంగా దర్యాప్తు చేసి, న్యాయస్థానంలో సమర్థవంతంగా విచారణ జరిగేలా పోలీసులు చర్యలు చేపట్టారు.
గండేపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని మురారి, గండేపల్లి, తాళ్లూరు, ఎల్లమిల్లి, జడ్. రాగంపేట గ్రామాల్లో 2022--2023 సంవత్సరాల్లో వరుస దొంగతనాలకు పాల్పడిన షేక్ అజీజ్ అలియాస్ నానీ, యడ్ల ఉషా సూర్య వెంకట రాజేష్ అనే ఇద్దరిని అప్పటి గండేపల్లి ఎస్ఐ వై. గణేష్ కుమార్ అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.
వీరిపై గండేపల్లి పోలీస్ స్టేషన్‌లో మొత్తం ఆరు క్రైమ్ కేసులు నమోదయ్యాయి. జతీఅఎవ చీశీ.266/2022, 29/2023, 88/2023, 110/2023, 111/2023, 112/2023 కేసుల్లో పోలీసులు దర్యాప్తు పూర్తి చేసి న్యాయస్థానంలో చార్జ్‌షీట్లు దాఖలు చేశారు.
కేసుల విచారణ సందర్భంగా‌ాూ ఎల్. లీలానాగరోజా బలమైన వాదనలు వినిపించగా, గండేపల్లి పోలీస్ సిబ్బంది కేసులను సమర్థవంతంగా మానిటరింగ్ చేశారు. దీంతో నేరం రుజువు కావడంతో పెద్దాపురం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి న్యాయస్థానం సోమవారం తీర్పు వెలువరించింది. ఇద్దరు నిందితుల్లో ఒక్కొక్కరికి ఒక్కో కేసులో ఆరు నెలల జైలు శిక్ష విధించింది.
నిందితులకు శిక్ష పడేలా సమర్థవంతంగా దర్యాప్తు నిర్వహించి, కోర్టు ట్రయల్‌ను పర్యవేక్షించిన గండేపల్లి ఎస్ఐ యు.వి. శివనాగబాబు, పోలీస్ సిబ్బంది, ాూ ఎల్. లీలానాగరోజాలను ఉన్నతాధికారులు అభినందించారు.

# అభివృద్ధి--సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం





- వద్దిపర్రులో 'రెండేళ్ల నమ్మకం--సంక్షేమం--అభివృద్ధి' కార్యక్రమం
- రూ.65 లక్షలతో నిర్మించిన వాటర్ ట్యాంక్ ప్రారంభించిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

**ఆత్రేయపురం పెన్ పవర్ ఆగస్టు 10:** రాష్ట్ర అభివృద్ధితో పాటు గ్రామాల సమగ్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. ఆత్రేయపురం మండలం వద్దిపర్రు గ్రామంలో సోమవారం నిర్వహించిన 'రెండేళ్ల నమ్మకం--సంక్షేమం--అభివృద్ధి' కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా జల జీవన్ మిషన్ ద్వారా రూ.65 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన వాటర్ ట్యాంక్‌ను ప్రారంభించారు.
అనంతరం ఎమ్మెల్యే గ్రామంలో ఇంటింటికీ వెళ్లి గత రెండేళ్లలో కూటమి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల వివరాలతో కూడిన కరపత్రాలను పంపిణీ చేశారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. సామాజిక భద్రతా పింఛన్ల పెంపుతో పాటు అన్నదాత సుఖీభవ, దీపం-2, తల్లికి వందనం, స్త్రీ శక్తి తదితర సంక్షేమ కార్యక్రమాల ద్వారా ప్రజలకు ప్రయోజనం కల్పిస్తున్నామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్లు పేర్కొన్నారు.

గ్రామంలో పలు అభివృద్ధి పనులు


గత రెండేళ్లలో వద్దిపర్రు గ్రామంలో పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు ఎమ్మెల్యే తెలిపారు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా గ్రామంలోని రైతులకు రూ.68.04 లక్షలు అందించామని, 12 మంది ఆటో డ్రైవర్లకు రూ.1.80 లక్షల మేర ఆర్థిక ప్రయోజనం కల్పించామని వివరించారు.మారిశెట్టివారిపాలెం ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి బీటీ రోడ్డుకు రూ.40 లక్షలతో, ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి రజకపేట వరకు రూ.50 లక్షలతో బీటీ రోడ్లు నిర్మించామని చెప్పారు. ఉపాధి హామీ పథకం నిధులతో రూ.15 లక్షలతో సీసీ రోడ్డు, పంచాయతీ నుంచి ఏటిగట్టు వరకు రూ.50 లక్షలతో సిమెంట్ రోడ్డు నిర్మించినట్లు తెలిపారు. రూ.5 లక్షలతో అంతర్గత సీసీ రోడ్లు, రూ.15 లక్షలతో డ్రైనేజీ పనులు చేపట్టామని, రూ.1.90 లక్షలతో చేతిపంపులు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.గ్రామంలో గోకులాల నిర్మాణంతో పాటు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా పలువురు గ్రామస్థులకు ఆర్థిక సహాయం అందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

ధవళేశ్వరం బ్యారేజీపై ప్రత్యేక దృష్టి

ధవళేశ్వరం బ్యారేజీపై కూడా కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఎమ్మెల్యే అన్నారు. రూ.35 లక్షలతో బ్యారేజీపై రోడ్డు నిర్మాణ పనులు చేపట్టామని తెలిపారు. బ్యారేజీ గేట్ల మరమ్మతు పనులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వయంగా వచ్చి శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు.
వద్దిపర్రు మెయిన్ రోడ్డును సిమెంట్ రోడ్డుగా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడుతున్నామని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తెలిపారు. గ్రామ ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను దశలవారీగా కల్పిస్తూ వద్దిపర్రును మరింత అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే బండారు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు కూసంపూడి రామకృష్ణంరాజు, ముళ్ళపూడి భాస్కరరావు, వెచ్చ అనిల్, పాలింగి రవిచంద్ర ,కుడప కృష్ణమూర్తి, హరిబాబు, మండల టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## ప్రభుత్వ హామీ అమలు చేసి సత్వర న్యాయం చేయండి

**పీజీఆర్ఎస్‌లో వేట్లపాలెం బాణాసంచా ప్రమాద బాధిత కుటుంబం వినతి**



**కాకినాడ, పెన్ పవర్,ఆగస్టు 10:** సామర్లకోట మండలం వేట్లపాలెం గ్రామంలో ఫిబ్రవరి 28న జరిగిన బాణాసంచా పేలుడు ప్రమాదంలో మృతి చెందిన గోడత మహేష్ కుటుంబానికి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసి సత్వర న్యాయం చేయాలని ఆయన భార్య గోడత శ్యామల కోరారు.సోమవారం కాకినాడ కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో ఆమె జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలకు నష్టపరిహారం మాత్రమే చెల్లించారని, ప్రభుత్వం నివేశనా స్థలం కేటాయించి ఇల్లు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చినప్పటికీ ఇప్పటివరకు అది అమలు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రమాదం జరిగి సుమారు ఏడు నెలలు గడుస్తున్నా తమ కుటుంబానికి పూర్తి స్థాయిలో న్యాయం జరగలేదని శ్యామల పేర్కొన్నారు. కుటుంబ యజమానిని కోల్పోవడంతో ప్రస్తుతం తమకు సరైన జీవనాధారం లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు.తన కుమార్తె కూడా జీవనాధారం కోల్పోయి ఒంటరిగా జీవనం సాగిస్తోందని, వితంతు పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ ఇప్పటివరకు మంజూరు కాలేదని బాధితురాలి తల్లి ఉంద్రాసు జీవరత్నం కన్నీటి పర్యంతమయ్యారు. కుటుంబానికి సొంత ఇల్లు లేకపోవడంతో పిల్లలతో కలిసి అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆమె తెలిపారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఇంటి స్థలం కేటాయించి ఇల్లు నిర్మించి ఇవ్వడంతో పాటు వితంతు పింఛన్ మంజూరు చేసి, కుటుంబానికి ఉపాధి కల్పించాలని కోరారు.తమ సమస్యను జిల్లా కలెక్టర్ సానుకూలంగా విని, న్యాయం జరిగేలా అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు.

## కాకినాడను గ్రీన్ సిటీగా తీర్చిదిద్దేందుకు కృషి




- ప్రతి ఒక్కరూ మొక్కల సంరక్షణలో భాగస్వాములు కావాలి
- జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్

**కాకినాడ, పెన్ పవర్,ఆగస్టు 10:** కాకినాడ నగరాన్ని మరింత పచ్చదనంతో నింపి హరితవనంగా, గ్రీన్ సిటీగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ దృఢ సంకల్పంతో కృషి చేయాలని జిల్లా యూత్ రెడ్ క్రాస్ కమిటీ చైర్మన్, జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ పిలుపునిచ్చారు.రాజా ట్యాంకు వద్ద ఉన్న వివేకానంద పార్కులో సోమవారం యూత్ రెడ్ క్రాస్, జూనియర్ రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమాన్ని జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్, కాకినాడ పట్టణ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, మున్సిపల్ కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ, రాష్ట్ర రెడ్ క్రాస్ చైర్మన్ రామారావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సుమారు ఎనిమిది అడుగుల ఎత్తు కలిగిన మొక్కలను నాటారు.ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ కాకినాడ నగరంలో పచ్చదనాన్ని పెంపొందించి గ్రీన్ సిటీగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. రానున్న మూడు, నాలుగు వారాల్లో నగరం చుట్టుపక్కల వివిధ ప్రాంతాల్లో విస్తృతంగా మొక్కలు నాటే కార్యక్రమాలను కొనసాగించ నున్నట్లు వెల్లడించారు.కాకినాడ నగర ప్రజలు స్వచ్ఛందంగా మొక్కలు నాటే కార్యక్రమాల్లో పాల్గొని గ్రీన్ కాకినాడ సాధనకు కృషి చేయాలని జేసీ కోరారు. నగరంలో పచ్చదనం పెంపొందించేందుకు రెడ్ క్రాస్ చేపడుతున్న కార్యక్రమాలకు ప్రజలు, యువత సహకరించాలని పిలుపునిచ్చారు.కాకినాడ పట్టణ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు మాట్లాడుతూ నగరంలో పచ్చదనం పెంపొందించడం, పర్యావరణాన్ని పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. మొక్కలు నాటడం అభినందనీయమని, అయితే మొక్కలు నాటడంతోనే బాధ్యత పూర్తికాదని, వాటిని సంరక్షించే బాధ్యతను కూడా యువత తీసుకోవాలని సూచించారు.
కాకినాడను హరిత నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో ముందుకు రావాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ కార్యదర్శి శివకుమార్,యువజన విభాగం యూత్ రెడ్ క్రాస్ సభ్యులు,తదితరులు పాల్గొన్నారు.

## కాకినాడ, పెద్దాపురం డివిజన్లలో 91 జేఎస్‌జేబీ పనుల క్షేత్రస్థాయి పరిశీలన

**పెన్ పవర్ ప్రతినిధి, ఆగస్టు 10:** జల సంరక్షణ, భూగర్భ జలాల పునరుద్ధరణకు సంబంధించిన జల సంచయ్ జన భాగీదారి (జె ఎస్ జె బి ) కార్యక్రమంలో భాగంగా కాకినాడ, పెద్దాపురం డివిజన్ల పరిధిలో చేపట్టిన పనులను కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ (ఎం ఓ ఆర్ డి ) బృందం క్షేత్రస్థాయిలో పరిశీలించనుంది. జె ఎస్ జె బి లో నీటి సంరక్షణ, వర్షపు నీటి నిల్వ, భూగర్భ జలాల రీచార్జ్ వంటి చర్యలకు ప్రాధాన్యం ఇస్తున్నారు.1
ఫీల్డ్ వెరిఫికేషన్ కోసం రూపొందించిన షెడ్యూల్ ప్రకారం ఆగస్టు 7 నుంచి 13వ తేదీ వరకు మొత్తం 91 పనులను పరిశీలించేందుకు ప్రణాళిక రూపొందించారు.

11న పెద్దాపురం డివిజన్‌లో 20 పనులు

ఆగస్టు 11న పెద్దాపురం డివిజన్ పరిధిలోని నాలుగు మండలాల్లో మొత్తం 20 పనులను పరిశీలించనున్నారు.

గండేపల్లి -- 2 పనులు
ఏలేశ్వరం -- 9 పనులు
జగ్గంపేట -- 3 పనులు
సామర్లకోట -- 6 పనులు

12న నాలుగు మండలాల్లో 14 పనులు


ఆగస్టు 12న ప్రత్తిపాడు, కిర్లంపూడి, పెద్దాపురం, శంఖవరం మండలాల్లో మొత్తం 14 పనులను పరిశీలించనున్నారు.

13న మరో 18 పనుల పరిశీలన

ఆగస్టు 13న రౌతులపూడి -- 9, తుని -- 6, కోటనందూరు -- 1, తొండంగి -- 2 చొప్పున మొత్తం 18 పనులను క్షేత్రస్థాయిలో తనిఖీ చేయనున్నారు.
ఇక అంతకుముందు ఆగస్టు 7న పిఠాపురం, గొల్లప్రోలు, యు.కొత్తపల్లి మండలాల్లో 14 పనులు, ఆగస్టు 8న తాళ్లరేవు, కాజులూరు, కరప మండలాల్లో మరో 14 పనులు, ఆగస్టు 10న పెదపూడి, కాకినాడ రూరల్ మండలాల్లో 11 పనుల పరిశీలనకు షెడ్యూల్ రూపొందించారు.
మొత్తం ఆరు దశల్లో 91 పనులను పరిశీలించనున్నట్లు షెడ్యూల్‌లో పేర్కొన్నారు. పనుల వాస్తవ పరిస్థితి, అమలు స్థాయి, నాణ్యత తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించడం ఈ వెరిఫికేషన్‌లో కీలకంగా ఉండనుంది. జల జీవన్ మిషన్ పరిధిలోని గ్రామీణ నీటి కార్యక్రమాల్లో పనుల నాణ్యత, పరిమాణం, అమలు పరిస్థితుల పరిశీలనకు ఫీల్డ్ వెరిఫికేషన్‌కు ప్రాధాన్యం ఉంది.

# దోమల నియంత్రణకు పటిష్ట చర్యలు





- పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలి
- జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్

**కాకినాడ, పెన్ పవర్,ఆగస్టు 10:** దోమల ద్వారా వ్యాపించే ప్రమాదకర వ్యాధుల నియంత్రణకు జిల్లాలో పటిష్టమైన చర్యలు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ తెలిపారు. ప్రజలు తమ పరిసర ప్రాంతాల్లో వర్షపు నీరు, మురుగునీరు నిల్వ ఉండకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు.దోమల నివారణ చర్యల్లో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో సోమవారం కాకినాడలోని కుళాయి చెరువు పార్క్‌లో గంబూజియా చేప పిల్లలను నీటిలోకి విడుదల చేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కే. అనిత ముఖ్య అతిథులుగా హాజరై గంబూజియా చేప పిల్లలను చెరువులోకి విడుదల చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గంబూజియా చేపలు నీటిలోని దోమల లార్వాలను ఆహారంగా తీసుకోవడం ద్వారా దోమల వృద్ధిని సమర్థవంతంగా నియంత్రించడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. జిల్లాలో దోమల నియంత్రణ చర్యలను మరింత పటిష్టంగా అమలు చేసేందుకు వినియోగంలో లేని చెరువులు,పాత బావులు,శాశ్వత నీటి నిల్వ ప్రాంతాలను ప్రత్యేకంగా గుర్తిస్తున్నట్లు చెప్పారు. గుర్తించిన నీటి నిల్వ ప్రాంతాల్లో గంబూజియా చేప పిల్లలను విడుదల చేసే కార్యక్రమాన్ని నిరంతరం నిర్వహిస్తామని కలెక్టర్ తెలిపారు. శాశ్వత మంచినీటి నిల్వలు, వినియోగంలో లేని బావులు, చెరువులు తదితర నీటి నిల్వ ప్రాంతాల్లో ఈ చేపలను విడుదల చేయడం వల్ల దోమల లార్వాలను తొలి దశలోనే నియంత్రించే అవకాశం ఉంటుందన్నారు.వర్షాకాలంలో దోమల ఉధృతిని తగ్గించి ప్రజారోగ్యాన్ని పరిరక్షించేందుకు ఈ ప్రత్యేక యాంటీ లార్వాల్ ఆపరేషన్‌ను ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.దోమల నియంత్రణలో ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని, తమ పరిసరాల్లో వర్షపు నీరు, వ్యర్థ నీరు నిల్వ ఉండకుండా చూసుకోవడంతో పాటు ఆరోగ్యశాఖకు సంపూర్ణ సహకారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అధికారి కే. కృష్ణారావు,జిల్లా లెప్రసీ,ఎయిడ్స్, క్షయ వ్యాధుల నివారణాధికారి డాక్టర్ ఎస్. చలమయ్య, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ కే. సుబ్బరాజు, జిల్లా మలేరియా అధికారి డి.హెచ్. ప్రత్యూష, ఎఫ్.ఆర్.టి.సి. వైద్యాధికారి డాక్టర్ ఎం. రవి, ఆర్.బి.ఎస్.కె. నోడల్ అధికారి డాక్టర్ వి. అరుణ, రామారావుపేట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ పి.జె.ఎస్. మౌనిక, మున్సిపల్ అధికారులు, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


# హెచ్ఐవీ, ఎయిడ్స్ రహిత సమాజ నిర్మాణంలో అందరూ భాగస్వాములు కావాలి

- యువత, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు చురుకైన పాత్ర పోషించాలి
- జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్




**కాకినాడ, పెన్ పవర్,ఆగస్టు 10:** హెచ్ఐవీ, ఎయిడ్స్ రహిత సమాజ నిర్మాణానికి యువత, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలందరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ పిలుపునిచ్చారు.ఎయిడ్స్ నియంత్రణ చర్యల్లో భాగంగా రూపొందించిన ప్రచార గోడపత్రికను సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ కేంద్రంలో జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్, డీఎంహెచ్ఓ డాక్టర్ కే. అనిత, ఎయిడ్స్ నియంత్రణ అధికారులు ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కాకినాడ జిల్లాలో ఈ నెల 12వ తేదీ నుంచి 45 రోజుల పాటు 'ఇంటెన్సిఫైడ్ ఐఈసీ క్యాంపెయిన్'నిర్వహించనున్నట్లు తెలిపారు. మొబైల్ వాహనాల ద్వారా ఎల్ఈడీ స్క్రీన్లతో ప్రచారం, ఐఈసీ కార్యక్రమాలు, ఇంటింటి సర్వేలు నిర్వహించి హెచ్ఐవీ/ఎయిడ్స్ నివారణ, నియంత్రణపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు.వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జిల్లా ఎయిడ్స్ నివారణ మరియు నియంత్రణ సంస్థ (డిషా--) ద్వారా ఈ కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. 2009 నుంచి రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు జిల్లాలో డిషా సేవలు నిరంతరాయంగా కొనసాగుతున్నాయని వివరించారు.

హెచ్ఐవీ గుర్తింపునకు ఐసీటీసీ కేంద్రాల ద్వారా ఉచిత పరీక్షలు,గర్భిణులకు ప్రత్యేక స్క్రీనింగ్, లైంగిక వ్యాధులకు చికిత్స, టీబీ అనుసంధాన సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. హెచ్ఐవీ బాధితులకు జీవితకాలం ఉచిత ఏఆర్టీ మందులతో పాటు పింఛన్ సౌకర్యం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. రక్త నిల్వ కేంద్రాల పర్యవేక్షణ, జైళ్లలో ఖైదీలకు పరీక్షలు, ప్రమాదకర ప్రవర్తన కలిగిన వర్గాలకు స్వచ్ఛంద సంస్థల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.ప్రచార కార్యక్రమాల్లో భాగంగా 300 గ్రామాల్లో అవగాహన సదస్సులు, ర్యాలీలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. 471 ఉన్నత పాఠశాలలు, 107 జూనియర్ కళాశాలల్లో రెడ్ రిబ్బన్ క్లబ్‌ల ద్వారా అవగాహన కార్యక్రమాలు చేపడతామన్నారు.ప్రజలను ఆకట్టుకునేలా 22 వీధి నాటికలు, కళాజాత ప్రదర్శనలు, 9,000 ఇళ్లలో ఇంటింటి ప్రచారం నిర్వహించనున్నట్లు తెలిపారు. మార్కెట్లు, మాల్స్‌లో ప్రత్యేక సమాచార ప్రసారాలు చేపడతామని చెప్పారు. యువత, విద్యార్థుల భాగస్వామ్యంతో 5 కిలోమీటర్ల 'రెడ్ రన్' మారథాన్, జిల్లా స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు నగదు బహుమతులు అందించడంతో పాటు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని వివరించారు.అలాగే ప్రజలకు నేరుగా అవగాహన కల్పించేందుకు 5 ప్రత్యేక వైద్య శిబిరాలు, 45,000 రిస్క్ అసెస్‌మెంట్ సర్వేలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై అపోహలను తొలగించి, నివారణ చర్యలపై అవగాహన పెంచేందుకు ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కే. అనిత, జిల్లా కుష్టు వ్యాధి, ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ ఎస్. చలమయ్య, జిల్లా వైద్యశాల సమన్వయ అధికారి డాక్టర్ రమేష్, వైద్య సిబ్బంది రామరాజు తదితరులు పాల్గొన్నారు.




# 49వ డివిజన్‌లో ఇంటింటికీ చేరిన 'తెలుగుదేశం'

కూటమి ప్రభుత్వ సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలపై ఇంటింటా అవగాహన






**కాకినాడ రూరల్, పెన్ పవర్,ఆగస్టు 10:** ప్రజల వద్దకే వెళ్లి వారి సమస్యలు తెలుసుకోవడంతో పాటు కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి కుటుంబానికి వివరించాలనే లక్ష్యంతో తెలుగుదేశం పార్టీ చేపట్టిన 'ఇంటింటికి తెలుగుదేశం' కార్యక్రమం సోమవారం కాకినాడ అర్బన్ పరిధిలోని 49వ డివిజన్‌లో ఉత్సాహంగా నిర్వహించారు.రాజేశ్వరి నగర్, భగవత్ మార్గ్, రామ్ నగర్ ప్రాంతాల్లో టీడీపీ కాకినాడ రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి--సత్యనారాయణమూర్తి దంపతులు ఇంటింటికీ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. స్థానిక సమస్యలు, మౌలిక వసతులు, ప్రజల అవసరాలను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. సూపర్-6 హామీల అమలు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం,తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ,యువతకు ఉపాధి అవకాశాలు, విద్యార్థులకు విద్యా ప్రోత్సాహం,సామాజిక భద్రతా పథకాలతో పాటు వివిధ వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై అవగాహన కల్పించారు. ప్రభుత్వ పథకాలతో కూడిన కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేశారు.అలాగే అమరావతి రాజధాని నిర్మాణం,పోలవరం ప్రాజెక్టు, భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం, పరిశ్రమల ఏర్పాటు, పెట్టుబడుల ఆకర్షణ, మౌలిక వసతుల విస్తరణ తదితర రాష్ట్ర అభివృద్ధి కార్యక్రమాల గురించి ప్రజలకు వివరించారు.ఈ సందర్భంగా పిల్లి అనంతలక్ష్మి--సత్యనారాయణమూర్తి దంపతులు మాట్లాడుతూ గతంలో అధికారంలో ఉన్నప్పుడు డీఎస్సీ నిర్వహణలో వైసీపీ ప్రభుత్వం అనుసరించిన తీరును ప్రజలు మరిచిపోలేదన్నారు. ఇప్పుడు డీఎస్సీ పేరుతో ప్రభుత్వంపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని వ్యాఖ్యానించారు. "ప్రజల కోసం పనిచేయాలా?రాజకీయాల కోసం దీక్షలు చేయాలా అనేది వైసీపీ ముందుగా నిర్ణయించుకోవాలి.కూటమి ప్రభుత్వం యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా ముందుకు సాగుతుంటే వాటిని స్వాగతించాల్సింది పోయి రాజకీయ ప్రయోజనాల కోసం తప్పుడు ప్రచారం చేయడం సరికాదు" అని వారు పేర్కొన్నారు.ప్రజల మధ్యకు వెళ్లి వారి సమస్యలను నేరుగా తెలుసుకోవడమే 'ఇంటింటికి తెలుగుదేశం' కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ప్రజలు తెలిపిన సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం సంక్షేమంతో పాటు అభివృద్ధికి సమాన ప్రాధాన్యత ఇస్తూ ముందుకు సాగుతోందన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పాలిక ఉషారాణి, 49వ డివిజన్ పార్టీ అధ్యక్షుడు పాలిక ప్రకాష్, క్లస్టర్ కన్వీనర్లు కర్రి వెంకటరాజు, ప్రకాష్, లోవబాబు, నరసింగరావు, త్రిమూర్తులు, మాజీ సర్పంచ్ పిల్లి కృష్ణ ప్రసాద్ (బుజ్జి), బంగార్రాజు, రామలింగరాజు, చందు, లోవరాజు, స్థానిక కూటమి నాయకులు, టీడీపీ కార్యకర్తలు, బూత్ కన్వీనర్లు, మహిళలు,యువత, డివిజన్ నాయకులు, రాజేశ్వరి నగర్, భగవత్ మార్గ్, రామ్ నగర్ ప్రాంతాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నీలాద్రిరావుపేటలో విత్తనాల డీలర్ లైసెన్స్ రద్దు



**గండేపల్లి, పెన్ పవర్, ఆగస్టు ,10:**రైతులకు నాణ్యత లేని విత్తనాలు విక్రయిస్తున్నారన్న ఫిర్యాదులు, నిబంధనల ఉల్లంఘనల నేపథ్యంలో గండేపల్లి మండలం నీలాద్రిరావుపేట గ్రామంలోని శ్రీదేవి ఆగ్రో ఏజెన్సీస్ విత్తనాల డీలర్ లైసెన్స్‌ను జిల్లా వ్యవసాయ అధికారి రద్దు చేశారు. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు గండేపల్లి మండల వ్యవసాయ అధికారి జె. లక్ష్మి తెలిపారు.

గత దాళ్వా పంట కాలంలో సదరు డీలర్ వద్ద కొనుగోలు చేసిన కమ్మిన వజ్ర, భాను బ్రాండ్ వరి విత్తనాలు తమ పొలాల్లో సరైన రీతిలో మొలకెత్తకపోవడంతో పాటు దిగుబడి తగ్గిందని పలువురు రైతులు వ్యవసాయ శాఖకు ఫిర్యాదు చేశారు. దీనిపై వ్యవసాయ శాఖ అధికారులు విచారణ చేపట్టగా, మారుటేరు పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు కూడా పరిశీలించి దిగుబడి తగ్గే అవకాశాలున్నట్లు నివేదిక ఇచ్చినట్లు అధికారులు తెలిపారు.

అయితే విత్తనాల కారణంగా నష్టపోయిన రైతులకు సంబంధిత కంపెనీ నుంచి ఎలాంటి పరిహారం అందలేదని పేర్కొన్నారు.

ఇదిలా ఉండగా, శ్రీదేవి ఆగ్రో ఏజెన్సీస్ రికార్డులను వ్యవసాయ శాఖ అధికారులు పరిశీలించగా పలు లోటుపాట్లు గుర్తించినట్లు తెలిపారు. దీంతో గండేపల్లి మండల వ్యవసాయ అధికారి డీలర్ లైసెన్స్ సస్పెన్షన్‌కు సిఫార్సు చేయగా, మార్చి నెలలో లైసెన్స్ సస్పెండ్ చేసినట్లు వెల్లడించారు.

అయినప్పటికీ షాపు యజమాని రామకృష్ణ జూన్ నెలలో అనధికారికంగా విత్తనాలను తీసుకొచ్చి రైతులకు విక్రయించినట్లు వ్యవసాయ శాఖ విచారణలో గుర్తించినట్లు అధికారులు తెలిపారు. అనంతరం మళ్లీ నాణ్యత లేని విత్తనాలు తీసుకొచ్చి విక్రయిస్తున్నారంటూ రైతుల నుంచి ఫిర్యాదులు రావడంతో వ్యవసాయ శాఖ పూర్తి స్థాయిలో విచారణ చేపట్టింది.

విత్తనాల డీలర్ లైసెన్స్ నిబంధనలను పదేపదే ఉల్లంఘించడం, నాణ్యతపై ఫిర్యాదులు రావడం, అనధికారికంగా విత్తనాల విక్రయానికి పాల్పడినట్లు గుర్తించడం వంటి కారణాలతో శ్రీదేవి ఆగ్రో ఏజెన్సీస్ డీలర్ లైసెన్స్‌ను జిల్లా వ్యవసాయ అధికారి రద్దు చేసినట్లు జె. లక్ష్మి తెలిపారు.

ఇకపై సదరు డీలర్‌కు విత్తనాల వ్యాపారం నిర్వహించేందుకు ఎలాంటి అనుమతి లేదని మండల వ్యవసాయ అధికారి స్పష్టం చేశారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో తప్పనిసరిగా లైసెన్స్ కలిగిన అధీకృత డీలర్ల వద్దనే కొనుగోలు చేసి, బిల్లులు తీసుకోవాలని వ్యవసాయ శాఖ సూచించింది.

# మామిడాడ జ్యోతుల పాపారావు సాగునీటి పథకం పనులు పూర్తి



**ఈనెల 15న రైతులకు నీరందించేందుకు చర్యలు**

**జగ్గంపేట, పెన్ పవర్, ఆగస్టు 10 :** జగ్గంపేట మండలం మామిడాడ గ్రామంలో రూ.3.82 కోట్లతో నిర్మించిన జ్యోతుల పాపారావు సాగునీటి పథకం పనులు పూర్తయ్యాయి. సోమవారం జగ్గంపేట ఎమ్మెల్యే, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు, తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి సభ్యులు జ్యోతుల నెహ్రూ పథకం పనులను పరిశీలించారు. ఈ పథకం ద్వారా మామిడాడ, ఇర్రిపాక, మర్రిపాక, నరేంద్రపట్నం పరిధిలోని కొంత భాగం, గొల్లలగుంట గ్రామాల్లో మొత్తం 4వేల ఎకరాలకు సాగునీరు అందనుంది. దశాబ్దాలుగా నీటి కోసం ఎదురుచూసిన రైతుల కల నెరవేరనుంది. ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం రోజున రైతులకు నీరు విడుదల చేసే కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయని జ్యోతుల నెహ్రూ తెలిపారు. ఈ ప్రాజెక్టు సాకారం కావడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, గత జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. వారి కృషి ఫలితంగానే నేడు వేలాది ఎకరాలకు శాశ్వత సాగునీరు అందుబాటులోకి వస్తోంది. పథకం పూర్తితో జగ్గంపేట నియోజకవర్గంలో వ్యవసాయ రంగానికి కొత్త ఊతం లభించనుంది. రైతుల ఆదాయం పెరగడంతో పాటు గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం కానుంది. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

# ఆదిత్య యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ యడ్లపల్లి శాంతిప్రియకు పీహెచ్‌డీ



**గండేపల్లి, పెన్ పవర్, ఆగస్టు, 10:** గండేపల్లి మండలం సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్సిటీలో మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న యడ్లపల్లి శాంతిప్రియ డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ (పీహెచ్‌డీ) పట్టా సాధించారు.

శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, తిరుపతి నుంచి ఆమె ఈ డాక్టరేట్‌ను పొందినట్లు ఆదిత్య యూనివర్సిటీ ప్రో-ఛాన్సలర్ డా. నల్లమిల్లి సతీష్ రెడ్డి తెలిపారు. ప్రొఫెసర్ బి. విజయలక్ష్మి మార్గదర్శకత్వంలో శాంతిప్రియ తన పరిశోధన థీసిస్‌ను సమర్పించారు.

ఈ సందర్భంగా యూనివర్సిటీ ప్రో-ఛాన్సలర్ డా. నల్లమిల్లి సతీష్ రెడ్డి శాంతిప్రియను అభినందించారు. ఆమె భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆదిత్య విద్యాసంస్థల అధినేత, యూనివర్సిటీ ఛాన్సలర్ డా. ఎన్. శేషారెడ్డి ఆకాంక్షించారు.

డిప్యూటీ ప్రో-ఛాన్సలర్ డా. ఎం. శ్రీనివాసరెడ్డి, వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎం.బి. శ్రీనివాస్, ప్రో-వైస్ ఛాన్సలర్ డా. ఎస్. రమాశ్రీ, డా. ఆదిరెడ్డి రమేష్, డా. రవి తంగజన్, రిజిస్ట్రార్ డా. జి. సురేష్‌తో పాటు వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది డా. యడ్లపల్లి శాంతిప్రియకు అభినందనలు తెలిపారు.ం

# కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ళు

ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ



**జగ్గంపేట, పెన్ పవర్, ఆగస్టు 10 :** రాష్ట్ర అభివృద్ధి, గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుందని జగ్గంపేట ఎమ్మెల్యే, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు జ్యోతుల నెహ్రూ వ్యాఖ్యానించారు. సోమవారం జగ్గంపేట మండలం మామిడాడలో రెండేళ్ల కూటమి ప్రభుత్వం నమ్మకం, సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మొదటగా గ్రామంలో ఇంటింటికి వెళ్లి గత రెండేళ్లలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాల గురించి ప్రజలకు వివరించి కరపత్రాలను అందజేశారు. అనంతరం రచ్చబండ కార్యక్రమం ఏర్పాటు చేసి ప్రజల నుంచి సమస్యను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకోవడానికి ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తుందన్నారు. సామాజిక భద్రతా పింఛన్ల పెంపు, అన్నదాత సుఖీభవ, దీపం 2 పథకం, తల్లికి వందనం, స్త్రీ శక్తి తదితర సంక్షేమ పథకాలను అందిస్తున్న విషయాన్ని ప్రజలకు వివరించారు. వైసీపీ పాలనలో అరాచకం రాజ్యమేలితే కూటమి పాలనలో రాష్ట్రం అభివృద్ధి దిశగా అడుగులు వేస్తుందన్నారు. గత రెండేళ్లలో ఒక్క మామిడాడ గ్రామంలోనే సంక్షేమ పథకాల అమలుతో పాటు ఎంతో అభివృద్ధి జరిగిందన్నారు.అన్నదాత సుఖీభవ 20,000 రూపాయలు రైతులకు , ఆటో డ్రైవర్లకు 15000అందజేయడం, సామాజిక పెన్షన్ లు4000, దివ్యాంగులకు 6000, 10000, 15000 తల్లికి వందనం ఎంతమంది పిల్లలు ఉంటే అందరికీ 13000 అందజేయడం జరిగిందన్నారు. గ్రామంలో సిమెంట్ రోడ్లు, జగ్గంపేట నుండి కాండ్రేగుల నరేంద్ర పట్నం, ఇర్రిపాక, సోమవారం మీదుగా రింగ్ రోడ్డు, గత పాలకులు విస్మరించిన మావిడాడ ఏలేశ్వరం రోడ్డు పూర్తి చేయడం జరిగింది అన్నారు. గ్రామానికి సాగునీరు అందించే జ్యోతుల పాపారావు నీటి పథకం తొందరలోనే ప్రారంభోత్సవం నిర్వహిస్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జ్ఞానజ్యోతి 120 రోజుల సర్టిఫికెట్ కోర్సు

అంగన్‌వాడీ కార్యకర్తలకు 6 రోజుల శిక్షణ

**కాకినాడ, పెన్ పవర్,ఆగస్టు 10:** జిల్లా మహిళాభివృద్ధి,శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తల కోసం నిర్వహిస్తున్న జ్ఞానజ్యోతి 120 రోజుల సర్టిఫికెట్ కోర్సు లో భాగంగా రెండో, మూడో సంవత్సరాల సిలబస్‌పై ఆరు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఐసీడీఎస్ పీడీ సి.హెచ్. లక్ష్మి తెలిపారు. మహిళాభివృద్ధి,శిశు సంక్షేమశాఖ గుంటూరు డైరెక్టర్ విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం కాకినాడ జిల్లాలో ఈ శిక్షణను నాన్-రెసిడెన్షియల్ విధానంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. వారానికి మూడు రోజుల చొప్పున మొత్తం ఆరు రోజుల పాటు శిక్షణ కొనసాగుతుందని పేర్కొన్నారు.ఆగస్టు 11 నుంచి 13 వరకు మూడు రోజులు, అనంతరం ఆగస్టు 22 నుంచి 25 వరకు మరో మూడు రోజులు శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పీడీ వివరించారు.ఈ శిక్షణ కార్యక్రమంలో జిల్లాలోని సంబంధిత సీడీపీఓలు, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు తప్పనిసరిగా పాల్గొనాలని ఆమె సూచించారు. నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం శిక్షణ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఐసీడీఎస్ పీడీ సి.హెచ్. లక్ష్మి తెలిపారు.

# జగ్గంపేట మార్కెట్ కమిటీ అభివృద్ధికి పూర్తి సహకారం అందించాలి



**జగ్గంపేట, పెన్ పవర్, ఆగస్టు 10 :** జగ్గంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ జనరల్ బాడీ సమావేశం సోమవారం మార్కెట్ కమిటీ చైర్మన్ అడపా భరత్ అధ్యక్షతన సంఘ భవనంలో జరిగింది. సమావేశంలో రైతుల సంక్షేమం, మార్కెట్ అభివృద్ధికి సంబంధించిన పలు కీలక తీర్మానాలు ఆమోదించారు. అనంతరం చైర్మన్ అడపా భరత్, పాలకవర్గ సభ్యులు రావులమ్మ నగర్ లోని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో జగ్గంపేట ఎమ్మెల్యే, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు జ్యోతుల నెహ్రూను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. జగ్గంపేట మార్కెట్ కమిటీ అభివృద్ధికి ప్రభుత్వం ద్వారా తగిన నిధులు మంజూరు చేయాలి. మార్కెట్ యార్డ్ నిధులతో మెటల్ రోడ్ల నిర్మాణం చేపట్టాలి. రైతుల సౌకర్యార్థం గోకవరం, కిర్లంపూడి గ్రామాల్లో మార్కెట్ కమిటీ గోడౌన్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి. మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో కిర్లంపూడి మండలం ముక్కొల్లు, గండేపల్లి మండలం నాయకంపల్లి గ్రామాల్లో నిర్వహించే పశు వైద్య శిబిరాలకు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించాలి. ఆగస్టు 15న మార్కెట్ కమిటీ భవనంలో జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరు కావాలని ఆహ్వానించారు. ఈ వినతులపై ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ సానుకూలంగా స్పందించారు. ప్రభుత్వ సహకారంతో జగ్గంపేట మార్కెట్ కమిటీని మరింత అభివృద్ధి చేస్తామని, రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ బొదిరెడ్డి శ్రీనివాస్, పాలకవర్గ సభ్యులు బోదిరెడ్ల సుబ్బారావు, పీలా మహేష్, గుమ్మల్ల అనంతలక్ష్మి, సింగలూరి రామ్ దీపు, గమిని దుర్గాప్రసాద్, షేక్ వల్లి తదితరులు పాల్గొన్నారు.

# సోలార్ విద్యుత్‌ను వినియోగించుకోవాలి

ఎమ్మెల్యే బండారు సత్యానందరావు



**రావులపాలెం పెన్ పవర్ ఆగస్టు 10:** ప్రతి ఒక్కరూ సోలార్ విద్యుత్‌ను వినియోగించుకోవాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పిలుపునిచ్చారు. సోమవారం రావులపాలెం కాపు కళ్యాణ మండపంలో విద్యుత్, సోలార్ అధికారులతో లో-వోల్టేజ్, ఇతర విద్యుత్ సమస్యలపై సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లోని విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. పీఎం సూర్య ఘర్ పథకం ద్వారా రూఫ్‌టాప్ సోలార్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం గరిష్టంగా రూ. 78 వేల వరకు సబ్సిడీ అందిస్తుందని తెలిపారు.

నియోజకవర్గంలో కొత్త సబ్‌స్టేషన్ల నిర్మాణానికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. వాడపల్లి టెంపుల్ సిటీలో సబ్‌స్టేషన్ ఏర్పాటుకు ప్రతిపాదనలు ఉన్నాయని, జొన్నాడలోనూ సబ్‌స్టేషన్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రావులపాలెంలో 132 కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు వెల్లడించారు.

# చందన స్వరూపుడు వేంకటేశ్వర స్వామి నిత్యాన్నదానానికి రూ.1.20 లక్షల విరాళం



**ఆత్రేయపురం, పెన్ పవర్ ఆగస్టు 10:** ఆధ్యాత్మిక సేవలో భాగంగా వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామివారి నిత్యాన్నదాన కార్యక్రమానికి దొడ్డిపట్లకు చెందిన కుటుంబం సభ్యులురూ. 1,20,000 విరాళాన్ని అందజేసింది. భక్తుల సహకారంతో ఆలయంలో కొనసాగుతున్న నిత్యాన్నదాన కార్యక్రమానికి తమ వంతు సహాయంగా ఈ విరాళాన్ని సమర్పించినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ నల్లం సూర్యచక్రధర్‌రావు తెలిపారు. దొడ్డిపట్ల చెందిన చెరుకువాడ సంతోష్‌కుమార్ రాజు, కీర్తి దంపతులు, వారి కుటుంబ సభ్యులు సోమవారం వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం నిత్యాన్నదాన ప్రసాద వితరణకు రూ. 1.20 లక్షల విరాళాన్ని ఆలయ అధికారులకు అందజేశారు.

ఈ సందర్భంగా ఆలయ అసిస్టెంట్ కమిషనర్ నల్లం సూర్యచక్రధర్‌రావు మాట్లాడుతూ భక్తులు అందిస్తున్న విరాళాలతో నిత్యాన్నదాన కార్యక్రమం నిరంతరాయంగా కొనసాగుతోందన్నారు. స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు అన్నప్రసాదం అందించడం ద్వారా ఆలయ ధార్మిక సేవల్లో భక్తుల భాగస్వామ్యం మరింత పెరుగుతోందని పేర్కొన్నారు.

విరాళం అందజేసిన దాత కుటుంబ సభ్యులకు ఆలయ అధికారులు స్వామివారి చిత్రపటంతో పాటు తీర్థప్రసాదాలను అందజేసి ఆశీర్వచనాలు తెలిపారు. నిత్యాన్నదానానికి భక్తులు, దాతలు మరింతగా సహకరించాలని ఆలయ అధికారులు

# ఎస్సీ బాలుర హాస్టల్ మూసివేతపై భగ్గుమన్న దళిత సంఘాల తో నిరసన.....





## పాఠశాలకు దూరమనే సాకుతో మూసివేయడం...

## 41 మంది విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని వెంటనే పునః ప్రారంభించాలి

**శంఖవరం పన్ పవర్ ఆగష్టు 10:-** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం శంఖవరం గ్రామంలోని ఎస్సీ బాలుర హాస్టల్ మూసివేతపై దళిత, విద్యార్థి, ప్రజా సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. కొద్ది రోజుల క్రితం వరకు హాస్టల్‌లో 41 మంది విద్యార్థులు వసతి పొందుతుండగా.. పాఠశాలకు హాస్టల్ దూరంగా ఉందనే కారణంతో ఉన్నఫలంగా మూసివేయడం పేద, దళిత విద్యార్థుల విద్యకు ఆటంకం కలిగించడమేనని నాయకులు మండిపడ్డారు.

40 ఏళ్లుగా కొనసాగుతున్న హాస్టల్‌ను మూసివేయడానికి బదులు విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా మెరుగైన వసతులు కల్పించాలని నాయకులు డిమాండ్ చేశారు. పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు చదువును కొనసాగించేందుకు ప్రభుత్వ హాస్టళ్లు ఎంతో కీలకమని, అలాంటి వసతి గృహాన్ని మూసివేయడం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

హాస్టల్ పాఠశాలకు దూరంగా ఉంటే విద్యార్థులకు రవాణా సౌకర్యం ఏర్పాటు చేయాలని, అంతేకానీ హాస్టల్‌ను మూసివేయడం పరిష్కారం కాదని స్పష్టం చేశారు. విద్యార్థులకు భోజనం, వసతి, విద్యా సామగ్రి తదితర అన్ని రకాల సదుపాయాలు కల్పించి హాస్టల్‌ను యథావిధిగా కొనసాగించాలని కోరారు.

హాస్టల్ పునః ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ దళిత, విద్యార్థి, ప్రజా సంఘాల నాయకులు భారీ నిరసన చేపట్టారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. మూసివేసిన ఎస్సీ బాలుర హాస్టల్‌ను తక్షణమే తెరిచి విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. పాఠశాలకు దూరం సమస్యగా ఉంటే ప్రత్యేక రవాణా సౌకర్యం ఏర్పాటు చేసి విద్యార్థుల చదువుకు ఎలాంటి ఆటంకం లేకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు.

ఉద్యమం ఉధృతం చేస్తాం అన్ని హాస్టల్ పునఃప్రారంభించే వరకు దశలవారీగా ఉద్యమాన్ని కొనసాగిస్తామని నాయకులు హెచ్చరించారు. విద్యార్థుల విద్యా హక్కును కాపాడేందుకు అన్ని వర్గాల ప్రజలను కలుపుకుని పోరాటం చేస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో జై భీమ్ రావు భారత్ పార్టీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు తంతాటి కిరణ్, సీనియర్ దళిత నాయకుడు సరమళ్ల మధుబాబు, ఏఐఎం రాష్ట్ర నాయకుడు దిలీప్‌కుమార్, ఏఐఎం కాకినాడ జిల్లా అధ్యక్షుడు చినబాబు, మహిళా అధ్యక్షురాలు రాజ్యలక్ష్మి, బీఎస్పీ ప్రత్తిపాడు ఇన్‌చార్జి గునపర్తి అపురూప్ స్టూడెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇన్ ఇండియా కాకినాడ జిల్లా నాయకులు గంగా సూరిబాబు, దళిత నాయకులు బత్తిన తాతాజీ, బోట్ల లావరాజు, దడాల బాబ్జి, ముఖే వీరబాబు, బీర గాంధీ, బీర రామకృష్ణ, ప్రసాద్, గుణపర్తి రాఘవ, గంటా భాస్కర్, ముఖే నాని బాబు, ఎలుగుండి రాము, కానేటి వెంకటరమణ, సరిపల్లి వెంకటేష్, కందనాడ అప్పారావు, బోడపాటి మోహన్, తదితరులు పాల్గొని హాస్టల్ పునఃప్రారంభించాలని డిమాండ్ చేశారు.



# తలుపులమ్మ అమ్మవారి నవరాత్రి మాల దీక్ష విరమణ





**పెన్ పవర్ ప్రతినిధి(తుని) ఆగస్టు 10 ::** లోవ గ్రామంలో తొలిసారిగా నిర్వహించిన శ్రీ తలుపులమ్మ అమ్మవారి నవరాత్రి మాల దీక్ష కార్యక్రమంలో దీక్ష స్వీకరించిన 35 మంది భక్తులు భక్తిశ్రద్ధలతో దీక్ష విరమణ చేశారు. ఆలయ అధికారులు, అర్చకులు, గురుస్వాముల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం వైభవంగా జరిగింది.

దీక్షను పూర్తి చేసిన భక్తులు ఎన్‌హెచ్ అనుకుని ఉన్న నమూనా అమ్మవారి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షులు పెంటకోట భాస్కర సత్యనారాయణ, కార్యనిర్వహణాధికారి పి. విశ్వనాథరాజు ఆధ్వర్యంలో అర్చకులు, గురుస్వాములు అందజేసిన ఇరుముడులను భక్తులు స్వీకరించారు.

మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ భక్తులు కాలినడకన లోవలోని అమ్మవారి తొలిమెట్టు వద్ద కొలువైన క్షేత్రపాలకుడు శ్రీ ఆంజనేయస్వామి ఆలయానికి చేరుకుని పూజలు నిర్వహించారు. అనంతరం మెట్ల మార్గంలో కొండపై ఉన్న శ్రీ తలుపులమ్మ అమ్మవారి ఆలయానికి చేరుకుని అభిషేక పూజలు చేసి, ఇరుముడులను అమ్మవారికి సమర్పించారు.

ఆలయ అర్చకుల సమక్షంలో నిర్వహించిన మహా హోమంలో పూర్ణాహుతి కార్యక్రమంతో భక్తులు దీక్ష విరమించారు. అనంతరం వేదపండితులచే భక్తులకు వేదాశీర్వచనం నిర్వహించి, అమ్మవారి శేషవస్త్రాలతో సత్కరించి ఉచిత ప్రసాదాలను అందజేశారు.

చిన్నారుల కోలాట ప్రదర్శన

కార్యక్రమంలో రామకృష్ణనగర్ చిన్నారులు ప్రదర్శించిన కోలాట నృత్యం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు, భక్తులు, శ్రీవారి సేవకులు తదితరులు పాల్గొన్నారు.

పుస్తక రూపంలో దీక్ష నియమావళి

శ్రీ తలుపులమ్మ అమ్మవారి మాల దీక్షను భక్తులు సులభంగా స్వీకరించేలా నవరాత్రి (తొమ్మిది రోజులు), అర్ధమండల, మండల దీక్షలకు సంబంధించిన నియమ నిబంధనలను పుస్తక రూపంలో అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఆలయ వైదిక కమిటీ, అర్చకులు, వేదపండితులు తెలిపారు.

భక్తులు అమ్మవారి మాల దీక్షను భక్తిశ్రద్ధలతో, నియమనిష్ఠలతో ఆచరించి తమ మనోసంకల్పాలను నెరవేర్చుకోవాలని ఆలయ అధికారులు ఆకాంక్షించారు. “అమ్మవారి సేవలో” ఉప కమిషనర్, కార్యనిర్వహణాధికారి తెలిపారు.

# గొల్లలగుంటలో ఇంటింటికి తెలుగుదేశం



## రచ్చబండలో ప్రజా సమస్యలు తెలుసుకున్న ఎమ్మెల్యే నెహ్రూ

**జగ్గంపేట, పెన్ పవర్, ఆగస్టు 10 :** కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో సంక్షేమం అభివృద్ధి నమ్మకం అనే నినాదంతో జగ్గంపేట మండలం గొల్లలగుంట గ్రామంలో ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జగ్గంపేట నియోజకవర్గం నియోజకవర్గ అబ్జర్వర్, అమలాపురం రూరల్ డెవలప్మెంట్ చైర్మన్ అల్లాడ స్వామి నాయుడు, జిల్లా టిడిపి ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీనివాస్ బాబా విశిష్ట అతిథిలుగా హాజరైన ఈ కార్యక్రమానికి జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఇంటింటికి తిరుగుతూ అభివృద్ధి కరపత్రాలు పంచుతూ ప్రజలకు రెండేళ్ల అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించారు. అనంతరం రచ్చబండ కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి వచ్చిన సమస్యలు విని వెంటనే పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ గ్రామంలో సిమెంట్ రోడ్లకు, గోశాలలకు రెండు కోట్ల రూపాయలతో గ్రామానికి అభివృద్ధి జరిగిందన్నారు. చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని అన్నారు. పవన్ కళ్యాణ్ ప్రజా సమస్యలపై చూపిస్తున్న చిత్తశుద్ధి వల్లే ఈరోజు ప్రతి గ్రామానికి నిధులు వస్తున్నాయని చెప్పారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచితే చంద్రబాబు వచ్చాక ప్రతి పైసా ప్రజల అభివృద్ధికి ఖర్చు చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

# రైతన్నా...మీకోసం కార్యక్రమం విజయవంతం చేయండి



## వ్యవసాయ అధికారి పడాల గాంధీ

## ఎల్నినో ని సమర్థవంతంగా ఎదుర్కొందాం....

**శంఖవరం పెన్ పవర్ ఆగష్టు 10:-** ఎల్నినో ప్రభావంతో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఉంటాయని, స్వల్ప కాలిక రకాలను, ఆరుతడి పంటలను సాగు చేసుకోవాలని, నీటిని పొదుపుగా వాడుకోవాలని, కలుపు మరియు చౌడు సమస్యలు ఎక్కువ అవ్వొచ్చు కనుక రైతులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డా సీతారామ శర్మ రైతులకు సూచించారు. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం అన్నవరంగ్రామం లో వ్యవసాయ అధికారి పి గాంధీ ఆధ్వర్యంలో రైతన్నా...మీకోసం కార్యక్రమం నిర్వహించి ప్రస్తుత ఎల్నినో ప్రభావం గూర్చి వివరించి పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గూర్చి మరియు వరి , అపరాల సాగులో రైతులకున్న సందేహాలను శాస్త్రవేత్తలు నివృత్తి చేశారు. ప్రధాన మంత్రి పంటల బీమా యోజన పథకంలో ప్రతీ వరి రైతు భీమా ప్రీమియం చెల్లించాలని వ్యవసాయ అధికారి పి గాంధీ రైతులకు సూచించారు. పంట నమోదు, ప్రకృతి వ్యవసాయ పద్ధతులు గూర్చి రైతులకు వివరించారు.

శాస్త్రవేత్త డా. సుజాత, వ్యవసాయ సహాయకుడు జగదీష్, నీటిపారుదల శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

# అభివృద్ధి- సంక్షేమానికి నిర్వచనం కూటమి ప్రభుత్వ పాలన...

- ఎన్డీఏ కూటమి పాలనతోనే స్వర్ణాంధ్ర సాకారం
- ప్రజల ముంగిటకు ప్రభుత్వ విజయాలను తీసుకెళ్లడమే లక్ష్యం
- నెల్లిపూడి గ్రామంలో ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభ రాజా



**శంఖవరం, పెన్ పవర్ ఆగస్టు 10 :–** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేసే లక్ష్యంతో నిర్వహిస్తున్న ప్రత్యేక ఇంటింటి ప్రచార కార్యక్రమంలో ప్రత్తిపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభ రాజా నెల్లిపూడి గ్రామంలో పాల్గొన్నారు. రాష్ట్ర రోడ్ల డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వెన్నా ఈశ్వరుడు (శివ) దేవస్థానం పాలకమండలి సభ్యులు పర్వత సురేష్, మార్కెట్ యార్డ్ చైర్మన్ బద్ది రామారావు మణి తో పాటు కూటమి నాయకులతో కలిసి ఎమ్మెల్యే సత్య ప్రభ ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్య ప్రభ ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం రెండేళ్లలో సాధించిన అభివృద్ధి విజయాలు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ప్రజలకు అందిస్తున్న సేవలను వివరించారు. విద్య, వైద్యం, మౌలిక సదుపాయాలు, మహిళా సాధికారత, యువతకు ఉపాధి అవకాశాల కల్పనతో పాటు వివిధ రంగాల్లో ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను ప్రజలకు వివరించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా చూడటమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో ప్రభుత్వం పారదర్శకమైన పాలన అందిస్తూ అభివృద్ధి, సంక్షేమాన్ని సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతోందన్నారు. గత రెండేళ్లలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలను ఇంటింటికీ తీసుకెళ్లి ప్రజలకు వివరించడమే ఈ ప్రచార కార్యక్రమం ఉద్దేశమన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు ప్రజల నుంచి విశేష స్పందన, ఆదరణ లభిస్తోందన్నారు.

ప్రజల ఆదరణతో కూటమి ప్రభుత్వం మరింత పటిష్టం రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వెన్నా శివ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యత కల్పించిందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజల సమస్యలను తెలుసుకుంటూ, వారికి ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై అవగాహన కల్పిస్తూ ముందుకు సాగుతున్నామని చెప్పారు. ప్రజల నుంచి లభిస్తున్న ఆదరణ కూటమి ప్రభుత్వంపై ఉన్న విశ్వాసానికి నిదర్శనమన్నారు. రానున్న రోజుల్లో ప్రత్తిపాడు ప్రాంత అభివృద్ధికి కూటమి ప్రభుత్వం మరింత కృషి చేస్తుందని తెలిపారు.

పూలజల్లు , హారతులతో ఘన స్వాగతం

ఇంటింటి ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే సత్య ప్రభకు స్థానిక ప్రజలు అడుగడుగునా పూలవర్షం కురిపిస్తూ, హారతులతో ఘనంగా స్వాగతం పలికారు. మహిళలు, యువత, స్థానిక ప్రజలు ఎమ్మెల్యేని ఆత్మీయంగా కలుసుకుని ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై స్పందించారు. ఈ కార్యక్రమంలో , జనసేన రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మేడిశెట్టి సూర్యకిరణ్ (బాబీ) మాజీ ఎంపీపీ బొమ్మిడి సత్తిబాబు పలివేల సతీష్ కీర్తి సుభాష్ దొరగారు బద్ది రామకృష్ణ బద్ది లావరాజు పొలం చిన్న తో పాటు పెద్ద ఎత్తున కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## తునిలో ఫుడ్ కమిషన్ చైర్మన్ ఆకస్మిక తనిఖీలు

అంగన్వాడీల్లో పిల్లలు లేకపోవడంపై ఆగ్రహం.. ఇద్దరు వర్కర్ల తొలగింపునకు ఆదేశాలు





**పెన్ పవర్ ప్రతినిధి (తుని:) ఆగస్టు 10:** పట్టణంలో ఫుడ్ కమిషన్ చైర్మన్ ప్రతాపరెడ్డి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అంగన్వాడీ కేంద్రాలు, రేషన్ దుకాణాలు, హాస్టళ్లలోని ఏర్పాట్లను పరిశీలించిన ఆయన పలు లోపాలు గుర్తించి సంబంధిత అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం.

అంగన్వాడీ కేంద్రాల తనిఖీలో పిల్లలు లేకపోవడం, స్టాక్ బుక్ సక్రమంగా నిర్వహించకపోవడం వంటి లోపాలను గుర్తించిన చైర్మన్.. బాధ్యతల్లో నిర్లక్ష్యం వహించిన ఇద్దరు అంగన్వాడీ వర్కర్లను తక్షణమే తొలగించాలని అధికారులను ఆదేశించినట్లు తెలిసింది.

బయోమెట్రిక్ లేకుండానే సరుకుల పంపిణీపై మండిపాటు

రేషన్ దుకాణాల తనిఖీలో బయోమెట్రిక్ విధానం పాటించకుండానే సరుకులు పంపిణీ చేస్తుండటంపై చైర్మన్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. నిబంధనలను పక్కనపెట్టి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న డీలర్ల తీరుపై మండిపడ్డారు.

ప్రజలకు అందాల్సిన నిత్యావసర సరుకుల పంపిణీలో ఎలాంటి అక్రమాలకు, నిర్లక్ష్యానికి తావులేదని ఆయన స్పష్టం చేసినట్లు సమాచారం. నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

తప్పు చేస్తే సుమోటో కేసులు

డీలర్లు, పీడీలు, కమిషనర్లు తదితర బాధ్యులు విధుల్లో నిర్లక్ష్యం లేదా అక్రమాలకు పాల్పడినట్లు తేలితే సుమోటో కేసులు నమోదు చేసి కోర్టుకు పంపుతామని ఫుడ్ కమిషన్ చైర్మన్ హెచ్చరించారు.

హాస్టళ్లు, రేషన్ దుకాణాలు, అంగన్వాడీ కేంద్రాల్లో ఎక్కడైనా లోపాలు కనిపిస్తే ప్రజలు వాటిని వీడియో రూపంలో చిత్రీకరించి ఫుడ్ కమిషన్ వాట్సాప్ నంబర్ 9490551117కు పంపాలని ఆయన కోరారు.

ప్రజలకు అందాల్సిన ఆహార పదార్థాలు, రేషన్ సరుకులు సక్రమంగా అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని చైర్మన్ ఆదేశించినట్లు సమాచారం

## శ్రీ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యా మిత్ర కిట్స్ పంపిణీ...







- తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి అన్నవరం ట్రస్ట్ బోర్డ్ మెంబర్ పర్వత సురేష్...
- కస్తూర్బా గాంధి బాలిక విద్యాలయం లో
- దోమల నెట్స్ పంపిణీ....
- శంకవరం ప్రభుత్వ వైద్యులు డాక్టర్ ఎస్. ఎస్ రాజీవ్ కుమార్

**శంఖవరం పెన్ పవర్ ఆగస్టు 10:–** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం మండల కేంద్రమైన శంఖవరంలో కస్తూర్బా గాంధి బాలికా విద్యాలయం లో దోమల నెట్స్ పంపిణీ మరియు సర్వేపల్లి రాధాకృష్ణ విద్యా మిత్ర కిట్స్ పంపిణీ కార్యక్రమం జరిగింది

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి అన్నవరం ట్రస్ట్ బోర్డ్ మెంబర్ నాయకులు పర్వత సురేష్ ఈ సందర్బంగా మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఈ కార్యక్రమం లో విద్యార్థులు తల్లి దండ్రులు లను, గురువులను, గౌరవించాలని, ప్రభుత్వం అనేక సౌకర్యాలు కల్పిస్తుందని ఈ సౌకర్యాలు విద్యార్థులు వినియోగించుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని , ఇక్కడ అందరు కష్టపడుతున్నారని,మంచి ఆహారం, సౌకర్యాలు అందిస్తున్నారని మంచి ఫలితాలు తీసికోస్తున్నారని ఆయన అన్నారు. విద్యార్థులు బాగా చదివి పాఠశాలకి, తల్లి దండ్రులు లకు, మంచి పేరు తీసికురావాలని అన్నారు. . సరియైన ఆహారం, పరిశుభ్రత, పట్ల జాగ్రత్తలు, తీసికుంటే ఆరోగ్య రీత్యా ఎదురుకొనే సమస్యలు తగ్గుతాయని, విద్యార్థుల కు తెలియజేసారు శంకవరం ప్రభుత్వ ఆసుపత్రి ప్రధాన వైద్యులు

డాక్టర్ ఎస్. ఎస్ రాజీవ్ కుమార్ మాట్లాడుతూ దోమల వల్ల వచ్చేది సమస్యలు, దోమల నెట్ వల్ల ఉపయోగాలు, ఆరోగ్యం పట్ల తీసికొనే చర్యలు గురించి తెలియజేసారు . పర్వత సురేష్ విద్యార్థులకు దోమల నెట్స్ అందచేశారు అదే విధంగా విద్యార్థులు కు శ్రీ సర్వేపల్లి రాధా కృష్ణ విద్య మిత్ర కిట్స్ పంపిణీ అందచేశారు..

ఈ కార్యక్రమంకి ఎస్ ఏం సి చైర్పర్సన్ ఏ. అనూష

డాక్టర్.రవిశంకర్ డెంటిస్ట్

బి .ఎర్రాబ్బాయి ఎస్ యు ఓ

ఎం వి ఎస్ రామకృష్ణ రావు, ఎంపీహెస్

ఆర్ . నూకరాజు, ఎంపీహెచ్ఏ

ఎం.శ్రీనివాసరావు ఎం పి హెచ్ ఎ

పి . కనకరావు

ఆర్ . రత్నశ్రీ, సిహెచ్ఓ / ఎమ్ ల్ హెచ్ పి

వి .అనంత లక్ష్మి (ఏఎన్ఎం)

జి . సుగుణ ( ఏఎన్ఎం )

జి . సునీత (ఆశ )

పి.విజయ (ఆశ )

జె .సూర్యకాంతం (ఆశ )

కె జి బి వి ప్రిన్సిపాల్ మరియు ఉపాధ్యాయల బృందం పాల్గొని విజయవంతం చేశారు .

## మంత్రి లోకేష్ రాజీనామా చేయాలి






**జగ్గంపేటలో వైసిపి భారీ బైక్ ర్యాలీ**

**జగ్గంపేట, పెన్ పవర్, ఆగస్టు 10:** డీఎస్సీ నియామకాల్లో చోటుచేసుకున్న అవకతవకలను నిరసిస్తూ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని, నిరుద్యోగ భృతి నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ జగ్గంపేటలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ నిరసన కార్యక్రమానికి జగ్గంపేట నియోజకవర్గ పార్టీ ఇన్చార్జి, మాజీ మంత్రి, తోట నరసింహం, రాష్ట్ర పార్టీ విద్యార్థి విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ తోట శ్రీరాంజీ నాయకత్వం వహించారు. జగ్గంపేట పట్టణంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి ప్రారంభమైన బైక్ ర్యాలీ జగ్గంపేట సెంటర్లోని వైయస్సార్ విగ్రహం వరకు కొనసాగింది. డీఎస్సీ నియామకాల్లో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ చేపట్టి నిరుద్యోగులకు న్యాయం చేయాలని పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను అమలు చేసి, నిరుద్యోగ భృతి నిధులను తక్షణమే విడుదల చేయాలని కోరారు. పార్టీ శ్రేణులు నినాదాలు చేస్తూ ప్రభుత్వ తీరుపై నిరసన వ్యక్తం చేశారు. ఈ ర్యాలీలో వైసీపీ నాయకులు ఒమ్మి రఘురామ్, గుల్లా ఏడుకొండలు, రామకుర్తి చంద్రమూర్తి, మద్దిపట్ల రామకృష్ణ చౌదరి, రావుల గణేష్ రాజా, శరకణం అచ్చిరాజు, వేగి రామకృష్ణ, పాముల చంటిబాబు, జాన్ వెస్లీ, అంబటి చిన్నా, కాపువరపు ప్రసాద్, జగ్గంపేట నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

# శంఖవరంలో కొబ్బరిచెట్ల బహిరంగ వేలం ఎప్పుడు...




### అధికారులపై గ్రామాభివృద్ధి సేవా సంఘం ఆగ్రహం

శంఖవరం పెన్ పవర్ ఆగస్టు 10:– కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం లో మండల కేంద్రమైన శంకవరం శంఖవరం గ్రామ పంచాయతీ పరిధిలోని సర్వే నెంబర్ 124/3లోని 0.84 సెంట్ల ప్రభుత్వ భూమిలో ఉన్న 56 కొబ్బరిచెట్ల ఆదాయం 1989 నుంచి నేటి వరకు పంచాయతీ ఖాతాలో జమ కాకుండా కొంతమంది పెత్తందారులు అక్రమంగా అనుభవిస్తున్నారని, అధికారుల అలసత్వంతోనే గ్రామ పంచాయతీకి తీరని అన్యాయం జరుగుతోందని శంఖవరం గ్రామాభివృద్ధి సేవా సంఘం ప్రెసిడెంట్ మేకల కృష్ణ మండిపడ్డారు. ఆయన సోమవారం కాకినాడ జిల్లా కలెక్టరేట్లో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్కు వినతిపత్రం సమర్పించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఈ వ్యవహారంపై గత జూన్ 1న స్థానిక ఎంపీడీఓ, తహశీల్దార్, పంచాయతీ రాజ్ అధికారులకు ఫిర్యాదు చేసి 60 రోజులు దాటినా కొబ్బరిచెట్లను స్వాధీనం చేసుకుని బహిరంగ వేలం నిర్వహించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. స్థానిక అధికారులు ఇంకా గత వైసీపీ ప్రభుత్వ మత్తులోనే ఉంటూ అక్రమార్కులకు కొమ్ముకాస్తున్నారని ఆరోపించారు. దీనిపై స్పందించిన జాయింట్ కలెక్టర్, ఎంపీడీఓ ద్వారా సమగ్ర విచారణ జరిపించి 90 రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యవర్గ సభ్యుడు బొమ్మిడి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు..



# బుధవారం శాకంబరిగా దర్శనమివ్వనున్న చింతలూరు నూకాలమ్మ

**ఆలమూరు, పెన్ పవర్, ఆగస్టు 10;**ఆషాఢ బహుళ అమావాస్య సందర్భంగా బుధవారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన చింతలూరు శ్రీ నూకాంబిక అమ్మవారు శాకంబరీ అలంకరణలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. కరువు కాటకాలను నివారించే శాకంబరి రూపంలో అమ్మవారిని దర్శించుకోవడం వల్ల అత్యంత శుభప్రదమైన ఫలితాలు లభిస్తాయని పురాణాలు చెబుతున్నాయి. అమ్మవారి అలంకరణ నిమిత్తం కూరగాయలు, ఆకుకూరలు ఇవ్వదలచిన భక్తులు మంగళవారం మధ్యాహ్నం కల్లా ఆలయంలో అందించాలని దేవస్థానం ఈవో ఉండవల్లి వీర్రాజు చౌదరి తెలిపారు. బుధవారం ఉదయం శాకంబరిగా అమ్మవారు దర్శనమివ్వనున్నారని, అలాగే అమావాస్య సందర్భంగా చండీ హోమం జరుగుతుందని, అమ్మవారికి పసుపు, కుంకుమ, స్వీట్లు, చీర సారె సమర్పించే భక్తులు బుధవారం ఉదయం చింతలూరు పంచాయతీ కార్యాలయం దగ్గర నుంచి మొదలయ్యే ఊరేగింపులో పాల్గొని అమ్మవారికి చీర, సారె సమర్పించాలని కోరారు. భక్తులంతా ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.



## ఎల్పీజీ వినియోగదారులు ఆగస్టు 15లోగా ఈ-కేవైసీ పూర్తి చేసుకోవాలి

- గడువులోగా పూర్తి చేయకపోతే గ్యాస్ కనెక్షన్ తాత్కాలికంగా నిలిచిపోయే అవకాశం
- జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్

**కాకినాడ, పెన్ పవర్,ఆగస్టు 10:** జిల్లాలోని అన్ని ఎల్పీజీ గ్యాస్ వినియోగదారులు తమ ఈ–కేవైసీ బయోమెట్రిక్ ధ్రువీకరణ ప్రక్రియను 2026 ఆగస్టు 15లోగా తప్పనిసరిగా పూర్తి చేసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ సూచించారు.భారత ప్రభుత్వ పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు ఈ–కేవైసీ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించినట్లు తెలిపారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ సివిల్ సప్లైస్ కమిషనర్ ప్రత్యేక ఆదేశాలు జారీ చేసినట్లు వెల్లడించారు.వినియోగదారుల వివరాలను ఖచ్చితంగా నమోదు చేయడం, అర్హులైన లబ్ధిదారులకు నిరంతరాయంగా గ్యాస్ సరఫరా అందించడం, అక్రమ వినియోగాన్ని నివారించడం, పారదర్శకతను పెంపొందించడం ఈ–కేవైసీ ప్రక్రియ ప్రధాన ఉద్దేశమని జాయింట్ కలెక్టర్ తెలిపారు.నిర్దేశిత గడువులోగా ఈ–కేవైసీ పూర్తి చేయని వినియోగదారుల గ్యాస్ కనెక్షన్లు తాత్కాలికంగా నిలిపివేయబడే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. అందువల్ల వినియోగదారులు చివరి తేదీ వరకు వేచి చూడకుండా వెంటనే ఈ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని సూచించారు.ఈ–కేవైసీ పూర్తి చేసుకునే మార్గాలు1. ఆయిల్ మార్కెటింగ్ కంపెనీల మొబైల్ యాప్‌ల ద్వారా:

హెచ్ పి పే యాప్ --హెచ్పీసీఎల్

– ఇండియన్ ఆయిల్ వన్ -- ఐఓసీఎల్

– హలో బిపి సిఎల్ యాప్ -- బిపిసిఎల్

2. సంబంధిత ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్ కార్యాలయాన్ని సందర్శించడం ద్వారా.
3. గృహాలకు గ్యాస్ సిలిండర్ సరఫరా చేసే డెలివరీ సిబ్బంది ద్వారా.

కాకినాడ జిల్లాలోని అన్ని ఎల్పీజీ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆగస్టు 15లోగా ఈ–కేవైసీ బయోమెట్రిక్ ధ్రువీకరణను పూర్తి చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ విజ్ఞప్తి చేశారు.

## బాలా త్రిపుర సుందరీ అమ్మవారికి బంగారు గాజుల విరాళం

రూ.3.60 లక్షల విలువైన రెండు బంగారు గాజులు సమర్పణ



**కాకినాడ, పెన్ పవర్,ఆగస్టు 10:** కాకినాడ పట్టణంలోని సూర్యారావుపేటలో కొలువై ఉన్న శ్రీ బాలా త్రిపుర సుందరీ సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో సోమవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం వాస్తవ్యులు శ్రీ బాలాభద్ర వెంకటరాజు, బాలాభద్ర లక్ష్మీకాంతి దంపతులు శ్రీ బాలా త్రిపుర సుందరీ అమ్మవారి అలంకరణ నిమిత్తం సుమారు రూ.3.60 లక్షల విలువైన 25 గ్రాముల బరువు కలిగిన రెండు బంగారు గాజులను దేవస్థానానికి విరాళంగా సమర్పించారు.ఈ విషయాన్ని దేవస్థాన కార్యనిర్వహణాధికారి వీర్రాజు ఒక ప్రకటనలో తెలిపారు. అర్చక మండలి సమక్షంలో దాతలు బంగారు గాజులను దేవస్థాన అధికారులకు అందజేసినట్లు పేర్కొన్నారు.అనంతరం దాత శ్రీ బాలాభద్ర వెంకటరాజు, ఆయన కుటుంబ సభ్యులను దేవస్థానం తరఫున ఘనంగా సత్కరించారు. శ్రీ బాలా త్రిపుర సుందరీ అమ్మవారి శేషవస్త్రం, అమ్మవారి ప్రతిమను అందజేసి ఆశీర్వచనాలు అందించినట్లు ఈఓ తెలిపారు.ఈ కార్యక్రమంలో దేవస్థాన అర్చకులు,ధర్మకర్తల మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.ం

## రాధా,రంగా మిత్ర మండలి రాష్ట్ర కార్యదర్శిగా అబ్బిరెడ్డి ఏసు ప్రమాణస్వీకారం

రాధా,రంగా మిత్ర మండలి ఆశయసాధనకు విశేషకృషి చేస్తానని వెల్లడి




**ఆలమూరు, పెన్ పవర్, ఆగస్టు 10;**రాష్ట్ర రాధా, రంగా మిత్ర మండలి రాష్ట్ర కార్యదర్శిగా డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట నియోజకవర్గం ఆలమూరు మండలం సంధిపూడి గ్రామానికి చెందిన అబ్బిరెడ్డి ఏసు సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. హైదరాబాద్ లో వున్న కెపి హెచ్ బీ కాలనీ సమీపంలో ఉన్న పిఎన్ఆర్ ఎంపైర్ బిల్డింగ్ లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాధా రంగా అభిమానులు మధ్య కోలాహలంగా ప్రమాణ స్వీకారం జరిగింది. నియోజకవర్గ నాయకులు, ఏసుకి శుభాకాంక్షలు తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



**జగ్గంపేట, పెన్ పవర్, ఆగస్టు 10:** జగ్గంపేట జాతీయరహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు అక్కడికక్కడే మృతిచెందాడు. దీనికి సంబంధించి జగ్గంపేట ఎస్ఐ టి.రఘునాధరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. జగ్గంపేట మండలం రాజపూడి గ్రామానికి చెందిన గాది కనకదుర్గకు ఇద్దరు కుమారులు. సుమారు ఐదు సంవత్సరాల క్రితం ఏలేశ్వరం మండలం యర్రవరం గ్రామ పరిధిలోని తోట పెద్దకాపుకి సంబంధించి పొలం లీజుకు తీసుకుని మొక్కలు వేసుకుని నర్సరీ నడుపుకుంటున్నారు. ఈ నర్సరీలో కనకదుర్గ, ఆమె చిన్న కుమారుడు గాది మణికంఠ(21) ఉంటున్నారు. సోమవారం బ్యాంకు పని మీద యర్రవరం నుంచి కనకదుర్గ జగ్గంపేట బస్సులో రావడం జరిగింది. అయితే బ్యాంకులో కట్టవలసిన డబ్బులు మరిచిపోవడంతో చిన్నకొడుకు గాది మణికంఠకు ఫోన్ చేసి డబ్బులు తీసుకురమ్మని చెప్పింది. మణికంఠ డబ్బులు తీసుకుని యర్రవరం నుంచి జగ్గంపేట మోటారు సైకిల్ పై వస్తుండగా జగ్గంపేట జాతీయరహదారిపై చర్చి వద్ద బైక్ వేగాన్ని నియంత్రించలేక ప్రమాదవశాత్తు అదుపుతప్పి రోడ్డుపై పడిపోయాడు. దీంతో మణికంఠకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మణికంఠ మోటారు సైకిల్ ముందుకు జారుకుంటూ పోవడంతో ముందు బైక్ పై వెళ్తున్న రామవరంకు చెందిన కోలా శ్రీనుకు గాయాలయ్యాయి. దీనిపై మణికంఠ తల్లి కనకదుర్గ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయడం జరిగిందని ఎస్ఐ రఘునాధరావు తెలిపారు.


## రాధా రంగా మిత్రమండలి రాష్ట్ర కార్యదర్శిగా గోవిందు ప్రమాణ స్వీకారం



### మిత్రమండలి ఆశయ సాధనకు కృషి చేస్తానని వెల్లడి

**ఆలమూరు, పెన్ పవర్, ఆగస్టు 10;**రాష్ట్ర రాధా రంగా మిత్రమండలి రాష్ట్ర కార్యదర్శిగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలంలోని సంధిపూడి గ్రామానికి చెందిన తోరాటి గోవిందు ప్రమాణం చేశారు. ఈమేరకు హైదరాబాద్ లోని కేపీహెచ్ బీ కాలనీ సమీపంలో నున్న పీఎన్ఆర్ ఎంపైర్ బిల్డింగ్ లో నిర్వహించిన ఈకార్యక్రమంలో అతిరథ మహారథుల మధ్య ఈప్రమాణ స్వీకారం జరిగింది. మిత్రమండలి ఆశయ సాధనకు విశేష కృషి చేస్తానని వెల్లడించారు. ఈసందర్భంగా నియోజకవర్గ వ్యాప్తంగా పలువురు నేతలు గోవిందును అభినందించారు.

## రెండేళ్ల నమ్మకం.. ప్రజల గుండెల్లో కూటమి పాలనకు సుస్థిర స్థానం





- అభివృద్ధి పరుగులు.. సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబానికి భరోసా
- మంత్రి సుభాష్ సమక్షంలో టీడీపీలోకి పలువురు వైసీపీ నేతలు,కార్యకర్తలు

**రామచంద్రపురం, పెన్ పవర్,ఆగస్టు 10:** కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ సోమవారం రామచంద్రపురం పట్టణంలోని 13వ,2వ వార్డుల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయా వార్డుల్లోని ప్రజలను మంత్రి నేరుగా కలుసుకుని ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు,వాటి ద్వారా ప్రజలకు అందుతున్న ప్రయోజనాలను వివరించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తామని భరోసా కల్పించారు.ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ సహకారంతో రాష్ట్రంలో సంక్షేమానికి పెద్దపీట వేస్తూ అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నామని తెలిపారు. మహిళలు, రైతులు,యువత,విద్యార్థులు, కార్మికులు,వృద్ధులు, పేదలు, మధ్యతరగతి వర్గాల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. గత రెండేళ్లలో రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలోకి తీసుకురావడంతో పాటు ప్రజలకు మెరుగైన పాలన అందించేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు.ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని, ప్రభుత్వం ప్రజలకు మరింత చేరువ కావాలనే ఉద్దేశంతోనే గడపగడపకు వెళ్లి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తున్నామని మంత్రి తెలిపారు.

రామచంద్రపురం నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ అవసరమైన మౌలిక వసతులు, ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నామని చెప్పారు. ప్రజల ఆశీస్సులు,కూటమి నాయకులు, కార్యకర్తల సమష్టి కృషితో రామచంద్రపురాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తామని మంత్రి సుభాష్ స్పష్టం చేశారు.

మంత్రి సుభాష్ సమక్షంలో టీడీపీలో చేరికలు టీడీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటింటి ప్రచార కార్యక్రమంలో పలువురు వైసీపీకి చెందిన నాయకులు, కార్యకర్తలు తెలుగుదేశం పార్టీలో చేరారు. వైసీపీ మాజీ కౌన్సిలర్ పలివెల సీతామహాలక్ష్మి--జగదీష్ దంపతులు 2వ వార్డు టీడీపీ నాయకుడు సవరపు సుధీర్ ఆధ్వర్యంలో మంత్రి సుభాష్ సమక్షంలో టీడీపీలో చేరారు.అలాగే 2వ వార్డు, కొత్తూరు రోడ్డుకు చెందిన సుమారు 20 మంది మహిళలు కూడా టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీలో చేరిన వారందరికీ మంత్రి సుభాష్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో పట్టణ టీడీపీ అధ్యక్షుడు ఉండవెల్లి శివ, కూటమి పార్టీల నాయకులు,స్థానిక వార్డు నాయకులు, క్లస్టర్, కో–క్లస్టర్ ఇన్‌చార్జ్జిలు,బూత్ నాయకులు, కార్యకర్తలు,స్థానిక ప్రజలు పాల్గొన్నారు.